# విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయపత్రికలో పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతుంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 9491134365



TGTEL/26/A6221

# తొలి వెలుగు

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం — జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక. 76 | సోమవారం | 12•అక్టోబర్•2026 | ఎడిటర్: యంజాల ప్రవీణ్ | పేజీలు: 8 | వెల రూ. 2/ |
|---|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvangiri | Volume: 01 | Issue. 76 | Monday | 12.10.2026 | Editor: Yamjala Praveen | pages: 8 | cost. 2/ |




## అంబానీపై మస్క్ గురి!

- 'అంబానీ దళారీ ఇంటర్నెట్ సైన్యం' అంటూ ఎక్స్‌లో పోస్టు
- స్టార్‌లింక్‌తో భారతీయులకు మరిన్ని ఇంటర్నెట్ ఆప్షన్లు
- ధరలు ఎక్కువైతే ఎవరూ కొనుగోలు చేయరన్న మస్క్

2

## డబ్బుల కోసం ఆరేళ్ల చిన్నారి హత్య!



### అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ దారుణం

- చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్
- హత్య చేసి సంపులో పడేసిన నిందితుడు
- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్
- కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

2



## ఢిల్లీలో ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించాలి

- కేంద్రం, పోలీసులకు సుప్రీం ఆదేశాలు
- బారికేడ్లు తొలగించాలని ఆదేశం
- ఆంక్షలపై అఫిడవిట్ దాఖలుకు సూచన

2



# తయారీలో భారత్ దూకుడు!

### ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా అవతరణ



### తమిళనాడు అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- రూ.13 వేల కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం
- రక్షణ రంగంలో స్వయం సమృద్ధి దిశగా అడుగులు
- 'మేక్ ఇన్ ఇండియా'తో యువతకు ఉపాధి అవకాశాలు
- సీఎం విజయ్ ప్రభుత్వానికి కేంద్రం సహకారం
- చెన్నైలో నిర్వహించిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ

2

## రాహుల్ గాంధీకి సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణ!

- ఎస్ఐఆర్‌పై వినతిపత్రం ఇచ్చేందుకు భేటీ కోరిన విపక్ష నేత
- సుప్రీంకోర్టు వరకు ఇండియా కూటమి శాంతియుత ర్యాలీకి వ్యూహం

2



## దేశం గొంతుకను అణగదొక్కలేరు

- లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ:** శాంతియుతంగా నిరసన తెలిపేందుకు ఢిల్లీకి తరలివచ్చిన యువతపై దాడులు జరిగాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. మనం కోరుకునే భారత్ ఇది కాదని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలోనే నేడు పార్టీలు, వర్గాలకు అతీతంగా దేశమంతా కలిసి సుప్రీంకోర్టు వరకు పాదయాత్ర నిర్వహించనున్నట్లు 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. "ప్రధాని మోదీ, అమిత్ షా, అజిత్ డొభాల్, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌లు దేశ గొంతుకను అణగదొక్కలేరు. మమ్మల్ని భయపెట్టలేరు. వారు తప్పుకోవాల్సిందే. ఓటు చోరీకి ముగింపు పలకాలని, 'సర్'ను నిలిపివేయాలని, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సీజేఐకి వినతిపత్రం ఇస్తాం. ప్రజాస్వామ్యాన్ని విశ్వసించి, రాజ్యాంగానికి కట్టుబడి ఉండేవారందరూ మాతో కలిసి రావాలి" అని రాహుల్ పిలుపునిచ్చారు.

## సీఈసీని కాపాడేందుకు ప్రజలతో యుద్ధమా?

- మోదీ, అమిత్‌షాపై కాక్రోచ్ జనతా పార్టీ నేతల విమర్శలు
- నిర్బంధాలు, కేసులతో ఉద్యమాన్ని ఆపలేరు
- సీఈసీ రాజీనామా చేసే వరకు పోరాటం
- ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు సృష్టించారని ఆరోపణ
- ఫోన్లు లాక్కొని హక్కులను హరించారంటూ మండిపాటు




**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను కాపాడేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దేశ ప్రజలతోనే పోరాడుతున్నారని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు ఆరోపించారు. నిర్బంధాలు, కేసులతో తమ ఉద్యమాన్ని అడ్డుకోలేరని, జ్ఞానేశ్ కుమార్ రాజీనా మా చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సీఈసీని కాపాడేందుకు దేశవ్యాప్తంగా భయానక పరిస్థితులు సృష్టించాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. జంతర్‌మంతర్ వద్ద ఆందోళన నేపథ్యంలో పోలీసుల నిర్బంధం నుంచి విడుదలైన అనంతరం సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు.

### ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు

నిరసన కార్యక్రమానికి వెళ్తున్న తమను నిన్న విమానంలోనే అదుపులోకి తీసుకున్నారని సీజేపీ నేతలు తెలిపారు. విమానం నుంచి బలవంతంగా బయటకు లాక్కెళ్లి, కిడ్నాప్ చేసినట్లుగా వ్యవహరించారని ఆరోపించారు. ఢిల్లీలో ఎమర్జెన్సీ తరహా పరిస్థితులు కనిపించాయని, గతంలో ఎమర్జెన్సీ గురించి విన్నామని, ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నామని వ్యాఖ్యానించారు. గతంలో ఎమర్జెన్సీ సమయంలోనూ రైళ్లను ఈ స్థాయిలో రద్దు చేయలేదని, ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద సంఖ్యలో రైళ్లను రద్దు చేయడంతో పాటు ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు.

### మోదీ ఎందుకు భయపడుతున్నారు?

ప్రధాని మోదీ అత్యున్నత తరువాయి 2లో



## దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ!

- మోదీ సర్కారుపై ఖర్గే విమర్శలు
- ఓట్ల చోరీకి ఈసీ స్వతంత్రతను దెబ్బతీస్తున్నారని ఆరోపణ
- ప్రధాని, అమిత్‌షా ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు
- సీఈసీకి ప్రత్యేక రక్షణలపై సీజేఐకు కాంగ్రెస్ అధ్యక్షుడి లేఖ
- విద్యార్థుల ఆందోళనలను అణచివేస్తున్నారు: సంజయ్ రౌత్

2

## డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా గోవా

- గోవా భూములపై బీజేపీ నేతల కన్ను!
- సీఎం ప్రమోద్ సావంత్ కాదు.. ప్రాపర్టీ సావంత్
- డ్రగ్స్‌కు యువత బలి.. మూడోసారి మోసపోవద్దు: సీఎం రేవంత్‌రెడ్డి



**పనాజీ:** గోవాలో బీజేపీ పాలనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలోని భూములు అన్యా క్రాంతమ వుతున్నాయని, బీజేపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని వ్యాఖ్యానించారు. గోవా సీఎం ప్రమోద్ సావంత్‌ను ప్రజలు 'ప్రాపర్టీ సావంత్' అని పిలుస్తున్నారని అన్నారు. గోవా పర్యటనలో భాగంగా ఆయన 'గోయ్ రాఖోన్' యాత్రలో పాల్గొని ప్రసంగించారు. ఢిల్లీలో నిరసన కార్యక్రమాల కారణంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ గోవాకు రాలేకపోయారని, ఆయన ప్రతినిధిగా తాను ఇక్కడికి వచ్చానని రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ పేరుతో పేదల ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపించారు. పేదలు, దళితులు, మైనారిటీలు, ఆదివాసీల ఓటు హక్కును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

### డ్రగ్స్ మాఫియాకు అడ్డాగా గోవా

గోవా యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్రాన్ని డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా మార్చారని తరువాయి 2లో



## రైతును అవమానించిన తహసీల్దార్ సస్పెన్షన్

- 'ఇంకా పురుగుల మందు తాగలేదా.. బతికే ఉన్నావా?' అంటూ వ్యాఖ్యలు
- రైతుతో దురుసు ప్రవర్తనపై కలెక్టర్ చర్యలు
- సోషల్ మీడియాలో వైరల్‌గా వీడియో
- ఆర్డీవో నివేదిక ఆధారంగా ఉత్తర్వులు

2

### వైరల్ వీడియోపై రైతు వివరణ

- తహసీల్దార్ వల్లే భూ సమస్య పరిష్కారమైంది
- 30 ఏళ్ల వివాదానికి తెరపడిందని స్పష్టీకరణ
- 6నెలల క్రితం నాటి సంభాషణతో వివాదం

## అభిజీత్ దీప్కేకు నానమ్మ మరణవార్త తెలిపాం

2

### అంత్యక్రియలకు వెళ్లేందుకు సాయం చేస్తామన్నాం

- ఢిల్లీ పోలీసుల ఖండన .. వీడియో విడుదల చేసిన పోలీసులు

**న్యూఢిల్లీ:** కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేకు ఆయన నానమ్మ మరణవార్త తెలియజేయలేదన్న ఆరోపణలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. ఈ విషాద సమాచారాన్ని ఆయనకు సున్నితంగా తెలియజేయడంతో పాటు, అంత్యక్రియలకు హాజరయ్యేందుకు స్వగ్రామానికి వెళ్లేలా ప్రయాణ ఏర్పాట్లలో సహకరిస్తామని చెప్పినట్లు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన వీడియోను ఆదివారం విడుదల చేశారు. తన కుమారుడికి నానమ్మ మరణవార్తను పోలీసులు తెలియ జేయలేదని అభిజీత్ దీప్కే తల్లి ఆరోపిం చారు. సీజేపీ కూడా ఇదే అంశంపై విమర్శ లు చేయడంతో ఢిల్లీ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నేహా యాదవ్ విలేకరుల సమావేశంలో వీడియోను ప్రదర్శించారు. సమాచారం అందిన వెంటనే దీప్కేకు నానమ్మ మరణం, అంత్యక్రియల సమయం గురించి తెలియజేశామని ఆమె స్పష్టం చేశారు. మానవతా దృక్పథంతో స్వగ్రామానికి



వెళ్లేందుకు అవసరమైన సహాయం అందిస్తామని చెప్పినా, ఆయన అందుకు నిరాకరించారని తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు కూడా అవకా శం కల్పించినట్లు వివరించారు. జంతర్ మంతర్ వద్ద నిరసనలో పాల్గొనేందుకు వెళుతున్న అభిజీత్ దీప్కేను విమానంలో ఉండగానే పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. అనంతరం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, ఆయనను విడుదల చేశారు.

### అమెరికా సీనియర్ కమాండర్ ఎదుటే.. ఎఫ్-35పై ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ చురకలు

- విమానాన్ని దగ్గర నుంచి చూసేందుకు అనుమతించరు
- భారత్‌కు విక్రయిస్తామంటూ మాట్లాడుతున్నారు
- ఎస్‌యూ – 57 కొనుగోలుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు

2



## ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా.. తేదీ, సమయం చెప్పండి!

2

- బీజేపీఅధ్యక్షుడు రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం సవాల్
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్ల తొలగింపుపై సమాధానం చెప్పాలి
- అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగొద్దు
- ఓటర్ల జాబితా సవరణ పారదర్శకంగా చేపట్టాలి
- 'ఓట్ బచావో.. దేశ్ బచావో'తో పోరాటం: మంత్రి

**హైదరాబాద్:** ఓటు హక్కు కోల్పోయిన వారిని తీసుకొస్తానని, ఇందుకు తేదీ, సమయం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావుకు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఓట్ల తొలగింపుపై బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో ఏవైనా తప్పులు జరిగితే వాటిని సరిదిద్దేందుకు సహకరించాలని, బీజేపీ కార్యకర్తలు కూడా ఈ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిస్తే ప్రజాస్వామ్యానికి మేలు జరిగేదని పేర్కొన్నారు. ఓటు హక్కు కోల్పోయిన వారు ఎవరైనా ఉన్నారా? అని రాంచందర్‌రావు ప్రశ్నించడంపై తరువాయి 2లో



# డ్రగ్స్ పెడ్లర్లకు అడ్డాగా గోవా

(మొదటిపేజీ తరువాయి)

మండిపడ్డారు. ఇప్పటికే రెండుసార్లు బీజేపీని నమ్మి గోవా ప్రజలు మోసపోయారని వ్యాఖ్యానించారు. మూడోసారి కూడా ఆ పార్టీని నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. గోవాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# రైతును అవమానించిన తహసీల్దార్ సస్పెన్షన్

**సిద్దిపేట:** భూ సమస్య పరిష్కారం కోసం వచ్చిన రైతుతో అవమానకరంగా మాట్లాడిన గజ్వేల్ తహసీల్దార్ స్వామిపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. రైతు పట్ల అధికారి వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో జిల్లా యంత్రాంగం స్పందించింది. ఆర్డీవో సమర్పించిన ప్రాథమిక నివేదిక ఆధారంగా జిల్లా కలెక్టర్ కె.హైమావతి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రైతుతో అమానవీయ వ్యాఖ్యలు

వ్యవసాయ భూమికి సంబంధించిన సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఓ రైతు పరిష్కారం కోసం గజ్వేల్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించారు. అక్కడ తహసీల్దార్ స్వామికి తన సమస్యను వివరించగా, ఆయన భరోసా ఇవ్వాల్సింది పోయి అవమానకరంగా మాట్లాడినట్లు ఆరోపణలు వచ్చాయి. 'నువ్వు ఇంకా పురుగుల మందు తాగలేదా.. బతికే ఉన్నావా?' అంటూ ప్రశ్నించినట్లు వీడియోలో వినిపిస్తోంది. తన పరిస్థితిని చూసి నవ్వుతారా? అని రైతు ఆవేదన వ్యక్తం చేయగా.. 'అవును.. నవ్వు వస్తది, బరాబర్ వస్తది' అంటూ అధికారి సమాధానం ఇచ్చినట్లు తెలుస్తోంది.

## వైరల్ వీడియోతో స్పందించిన యంత్రాంగం

రైతుతో తహసీల్దార్ మాట్లాడిన తీరుకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమైంది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారి ఇలా వ్యవహరించడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఘటనపై ప్రాథమిక విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఆర్డీవోను ఆదేశించారు.

## నివేదిక ఆధారంగా సస్పెన్షన్

ఆర్డీవో సమర్పించిన ప్రాథమిక నివేదికను పరిశీలించిన అనంతరం తహసీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు.

# వైరల్ వీడియోపై రైతు వివరణ

**సిద్దిపేట:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ తహసీల్దార్ పి.హెచ్. స్వామి, రైతు ఏసు మధ్య జరిగిన సంభాషణకు సంబంధించిన వీడియో వివాదం కొత్త మలుపు తిరిగింది. తనతో కఠినంగా మాట్లాడిన తహసీల్దార్‌కు రైతు మద్దతుగా నిలిచారు. తన భూ సమస్యను ఆయనే పరిష్కరించారని, ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవని స్పష్టం చేశారు.జ్వేల్ మండలం మక్తమాసాన్‌పల్లికి చెందిన రైతు ఏసు తన భూ సమస్యపై తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లినప్పుడు జరిగిన సంభాషణ వీడియో ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ''బతికే ఉన్నావా నువ్వు? పురుగుల మందు తాగలేదా?'' అని తహసీల్దార్ ప్రశ్నించడం, రైతు తన పరిస్థితిని చూసి నవ్వొస్తోందా అని అడగ్గా.. ''అవును వస్తది'' అని ఆయన సమాధానం ఇవ్వడం విమర్శలకు దారితీసింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. రైతు పట్ల అధికారి వ్యవహరించిన తీరు అమానవీయమని విమర్శిస్తూ, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. అయితే, ఈ వివాదంపై రైతు ఏసు శనివారం మరో వీడియో విడుదల చేసి వివరణ ఇచ్చారు. ప్రస్తుతం వైరల్ అవుతున్న సంభాషణ ఆరు నెలల క్రితం జరిగిందని తెలిపారు. దాదాపు 30 ఏళ్లుగా కొనసాగుతున్న తమ భూ వివాదాన్ని తహసీల్దార్ స్వామి చొరవ తీసుకుని పరిష్కరించారని చెప్పారు. ఆయన సహకారంతోనే భూసేకరణ పరిహారం అందిందని వెల్లడించారు. మరోవైపు, తహసీల్దార్ స్వామి కూడా ఈ వ్యవహారంపై స్పందించారు. రైతుతో ఉన్న పరిచయం, చనువు కారణంగానే అలా మాట్లాడానని వివరణ ఇచ్చారు. గతంలో రైతు పలుమార్లు పురుగుల మందు తాగి చనిపోతానని చెప్పడంతో ఆ ఉద్దేశంతోనే ప్రశ్నించానని తెలిపారు. కార్యాలయంలోని కొందరు సిబ్బంది తనపై అసూయతో సంభాషణలోని కొంత భాగాన్ని మాత్రమే కత్తిరించి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. రైతు వివరణ ఇచ్చినప్పటికీ, వైరల్ వీడియోపై చర్చ కొనసాగుతోంది. ఈ ఘటనపై ఉన్నతాధికారులు విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

### ఓటు కోల్పోయిన వారిని తీసుకొస్తా..

# తేదీ, సమయం చెప్పండి!

(మొదటిపేజీ తరువాయి)

మంత్రి తీవ్రంగా స్పందించారు. ఓటరు జాబితా ప్రక్షాళన చేపడితే పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని పొన్నం ప్రభాకర్ సూచించారు. ఓటు హక్కు కోసం పోరాడుతున్న వారిని దూషించడం తగదన్నారు. జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. అర్హులైన వారి పేర్లు తొలగిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని గుర్తుచేశారు.దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. మొత్తం ఎన్ని ఓట్లు తొలగించారు? వాటిలో అనర్హుల ఓట్లు ఎన్ని? పొరపాటున అర్హులైన వారి పేర్లు తొలగించారా? అనే వివరాలను స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఓటు హక్కును పరిరక్షించేందుకు 'ఓట్ బచావో.. దేశ్ బచావో' నినాదంతో పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ పేరుతో దేశవ్యాప్తంగా 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారని పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణలో 70 లక్షల ఓట్లు, హైదరాబాద్‌లోనే 40 లక్షల ఓట్లు తొలగించారని పేర్కొన్నారు.

ఈ గణాంకాలపై స్పష్టత ఇవ్వాలని, ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని అన్నారు. ఓటు హక్కు కోసం ప్రశ్నించే వారిని విమర్శించడం కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా చూడాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియపై కాంగ్రెస్ నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు శనివారం విమర్శించారు. తెలంగాణ ఓటరు జాబితా నుంచి పేరు తొలగిపోయిన ఒక్క ఓటరునైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల ముందుకు తీసుకురాగలరా? అని ప్రశ్నించారు. దీనికి స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్.. ఓటు హక్కు కోల్పోయిన వారిని తీసుకొస్తానని, ఇందుకు తేదీ, సమయం ప్రకటించాలని రాంచందర్‌రావుకు సవాల్ విసిరారు.

# పడవ బోల్తా.. 109 మంది వలసదారుల మృతి

**జిబూటి:** ఆఫ్రికా దేశమైన జిబూటి తీరంలో పడవ మునిగిపోయిన ఘటనలో 109 మంది వలసదారులు మృతి చెందారు. మరణించిన వారిలో 52 మంది పురుషులు, 42 మంది మహిళలు, 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతయినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ ప్రకటించింది. ప్రమాద సమయంలో పడవలో దాదాపు 350 మంది ఉన్నట్లు సమాచారం. జిబూటి నుంచి యెమెన్‌కు వెళ్తుండగా.. గుహెరే ప్రాంతానికి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. 80 మందికిపైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. అధికారులు ఘటనాస్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. ఉపాధి అవకాశాలు, భద్రత కోసం గల్ఫ్ దేశాలకు చేరుకోవాలనే ఆశతో ఏటా వేలాదిమంది వలసదారులు జిబూటి మీదుగా ప్రయాణించి.. ప్రమాదకర పరిస్థితుల్లో బాబ్ ఎల్ మండెబ్ జలసంధిని దాటి, యెమెన్‌కు వెళ్తుంటారు. 2025లో ఈ మార్గంలో 900 మందికిపైగా వలసదారులు గల్లంతు (కొందరు మరణించారు) అయినట్లు ఐఓఎం తెలిపింది.

# తయారీలో భారత్ దూకుడు!

**చెన్నై:** ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ అవతరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. రక్షణ పరికరాల తయారీలోనూ స్వయం సమృద్ధి సాధిస్తున్నామని చెప్పారు. గత 12 ఏళ్లలో దేశంలోని అనేక రంగాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని, తయారీ రంగం విస్తరణతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని వివరించారు. తమిళనాడు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని, ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. చెన్నైలో ఆదివారం రూ.13 వేల కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన అనంతరం ఆయన మాట్లాడారు.



## రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి

దేశాన్ని బలోపేతం చేయాలంటే రాష్ట్రాలు బలంగా ఎదగాలని మోదీ పేర్కొన్నారు. అందుకే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో తయారీ రంగాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా', 'వోకల్ ఫర్ లోకల్' వంటి కార్యక్రమాలతో తమిళనాడుకు ప్రయోజనం చేకూరుతోందన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కరుణానిధి, జయలలితలతో పలుమార్లు మాట్లాడే అవకాశం లభించిందని గుర్తుచేశారు. ప్రధానమంత్రి అయ్యాక జయలలిత, పన్నీర్‌సెల్వం, పళనిస్వామి, ఎం.కె. స్టాలిన్‌లతో కలిసి పనిచేశానని తెలిపారు. ప్రభుత్వాలు మారినా తమిళనాడును అభివృద్ధి చేయాలనే, ప్రజలకు సేవ చేయాలనే తన సంకల్పం మారలేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి విజయ్‌తో కలిసి ఈ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు.

## మెట్రో రెండో దశలో కొత్త మార్గం ప్రారంభం

చెన్నై పర్యటనకు వచ్చిన ప్రధాని మోదీకి విమానాశ్రయంలో గవర్నర్ అర్లేకర్, ముఖ్యమంత్రి విజయ్ ఘనస్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం వెలుపల కొద్దిసేపు రోడ్‌షో నిర్వహించిన ప్రధాని.. కార్యకర్తలకు అభివాదం చేశారు. రూ.4,900 కోట్ల వ్యయంతో నిర్మించిన చెన్నై మెట్రో రెండో దశలోని పూనమల్లి–వడపళని మార్గాన్ని ప్రారంభించారు. స్వయంగా యూపీఐ ద్వారా చెల్లింపులు చేసి టికెట్ కొనుగోలు చేసిన ఆయన.. సీఎం విజయ్‌తో కలిసి పోరూర్ నుంచి పూనమల్లి బైపాస్ స్టేషన్ వరకు మెట్రోలో ప్రయాణించారు.

## మౌలిక సదుపాయాలకు పెద్దపీట

తమిళనాడులో రహదారి మౌలిక సదుపాయాల అభివృద్ధికి రూ.3,700 కోట్లతో చేపట్టనున్న ఎన్‌హెచ్–744, ఎన్‌హెచ్–83 ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. పలు రైల్వే లైన్ల అభివృద్ధి, పోర్టుల సామర్థ్యం పెంపునకు సంబంధించిన ప్రాజెక్టులను ప్రారంభించారు. ఆధునికీకరించిన ఐదు అమృత్ భారత్ రైల్వే స్టేషన్లను జాతికి అంకితం చేశారు.



## మెదడుపై పరిశోధనలకు ప్రోత్సాహం

ఐఐటీ మద్రాస్‌లో ఏర్పాటు చేసిన సుధా గోపాలకృష్ణన్ బ్రెయిన్ సెంటర్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. మానవ మెదడుకు సంబంధించిన త్రీడీ అట్లాస్ మిషన్‌తో పాటు స్ట్రోక్ అట్లాస్‌ను ఆవిష్కరించారు. అనంతరం చెన్నైలోని జైగోపాల్ గరోడియా హిందూ విద్యాలయ స్వర్ణోత్సవ వేడుకల్లోనూ పాల్గొన్నారు.

### సీఈసీని కాపాడేందుకు
# ప్రజలతో యుద్ధమా?

(మొదటిపేజీ తరువాయి)

స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నారని, అలాంటప్పుడు ప్రజలు, యువతను చూసి ఎందుకు భయపడుతున్నారని సీజేపీ నేతలు ప్రశ్నించారు. శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా ప్రజలకు లేదా అని నిలదీశారు. నిన్న ఢిల్లీలో సుమారు 40 వేల మంది భద్రతా సిబ్బందిని మోహరించారని ఆరోపించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, సరిహద్దులతో పాటు జమ్మూకశ్మీర్ నుంచి కూడా బలగాలను రప్పించారని పేర్కొన్నారు. రైళ్లు, మెట్రో సేవలను రద్దు చేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని చెప్పారు.తమను మాఫియా ముఠాలను అరెస్టు చేసినట్లుగా అదుపులోకి తీసుకున్నారని, సెల్‌ఫోన్లు లాక్కొని ఇతరులతో మాట్లాడకుండా చేశారని ఆరోపించారు. ప్రైవేటు వాహనాల్లో ఒక్కొక్కరినీ ఒక్కో ప్రాంతానికి తరలించారని తెలిపారు.

## ఫోన్లను హ్యాకింగ్ చేశారని ఆరోపణ

కనీసం న్యాయవాదులను సంప్రదించే అవకాశం కూడా ఇవ్వకుండా తమ హక్కులను హరించారని సీజేపీ నేతలు ఆరోపించారు. తమ ఫోన్లను స్వాధీనం చేసుకుని హ్యాకింగ్, క్లోనింగ్‌కు పాల్పడ్డారని విమర్శించారు. సీజేపీ ముంబయి కోఆర్డినేటర్ ప్రణయ్‌ను పోలీసుల కస్టడీలో హింసించారని ఆరోపిస్తూ, ఈ ఘటనపై న్యాయస్థానాలు, మానవ హక్కుల సంస్థలు స్పందించాలని కోరారు.నిరసనల సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసుల వద్ద నేమ్ బ్యాడ్జీలు కూడా లేవని వారు పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్న జర్నలిస్టులను వేధిస్తున్నారని, వారిపైనా కేసులు నమోదు చేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు. సీఈసీ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని సౌరవ్ దాస్, అశుతోష్ రంకా స్పష్టం చేశారు.

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ!

**బెంగళూరు:** దేశంలో ఎన్నికల వ్యవస్థ స్వతంత్రతను దెబ్బతీస్తూ, ఓట్ల చోరీకి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పిస్తోందని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రజాస్వామ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. నిరసనకారులను అడ్డుకునేందుకు ఢిల్లీలో సుమారు 32 వేల మంది పోలీసులను మోహరించడమే ప్రభుత్వ భయానికి నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఆదివారం బెంగళూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.



## ఈసీ వ్యవహారంపై సీజేఐకు లేఖ

ఎన్నికల సంఘం నిర్ణయాలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ వ్యవహారశైలిపై ఎన్నికల కమిషనర్లు వ్యక్తం చేసిన అభ్యంతరాలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఖర్గే తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే సీజేఐకు లేఖ రాసినట్లు వెల్లడించారు. సోమవారం సాయంత్రం రాహుల్‌గాంధీతో పాటు ఇతర కీలక నేతలతో కలిసి సీజేఐను కలవనున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ తీరుపైనా ఆయన విమర్శలు గుప్పించారు.

## సీఈసీకి ప్రత్యేక రక్షణలెందుకు?

2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంపై ఖర్గే అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని ప్రత్యేక మినహాయింపులు, రక్షణలను సీఈసీకి మాత్రమే ఎందుకు కల్పించారని ప్రశ్నించారు. సీఈసీ తప్పులకు జీవితాంతం శిక్షల నుంచి మినహాయింపు కల్పించడం వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. ఈవీఎంలు, ఓట్ల చోరీ ద్వారా ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

## కాల్పులు జరిగినా పోరాడతాం: రౌత్

కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిరసనల నేపథ్యంలో జరిగిన అరెస్టులపై శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ బీజేపీపై మండిపడ్డారు. విద్యార్థులు చేపడుతున్న ఆందోళనలను ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జరుగుతున్న విస్తృత ఉద్యమంగా అభివర్ణించారు. అసమ్మతిని అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తామని ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీకి సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణ!





**న్యూఢిల్లీ:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ఎన్నికల సంఘం తీరుపై పోరాటానికి సిద్ధమవుతున్న ప్రతిపక్షాలకు కీలక పరిణామం ఎదురైంది. ఈ అంశాలపై చర్చించేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అపాయింట్‌మెంట్ కోరుతూ లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విజ్ఞప్తిని సీజేఐ కార్యాలయం తిరస్కరించింది. ఈ మేరకు కారణాలను వివరిస్తూ లిఖితపూర్వక సమాధానం పంపినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఓట్ల చోరీని అరికట్టాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతూ సీజేఐకి వినతిపత్రం సమర్పిస్తామని రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి అగ్రనేతలు ఆదివారం ప్రకటించారు. ఈ నేపథ్యంలో సోమవారం ఢిల్లీలో విపక్ష నేతలు, పౌర సమాజ ప్రతినిధులు, యువతతో కలిసి సుప్రీంకోర్టు వరకు భారీ శాంతియుత ర్యాలీ నిర్వహించి, సీజేఐకి మెమోరాండం అందించాలని కూటమి ప్రణాళిక రూపొందించింది.అయితే, న్యాయపరమైన పరిధిలో పరిశీలించాల్సిన అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధి బృందాలతో ప్రత్యేకంగా వ్యక్తిగత భేటీలు నిర్వహించడం సాధ్యం కాదనే సంకేతాన్ని సీజేఐ కార్యాలయం ఇచ్చినట్లు తెలుస్తోంది. న్యాయస్థానాల పరిధిలోని అంశాలను న్యాయ ప్రక్రియ ద్వారానే పరిశీలించాల్సి ఉంటుందనే అభిప్రాయం ఈ పరిణామంతో వ్యక్తమవుతోంది.సీజేఐ అపాయింట్‌మెంట్ నిరాకరణ నేపథ్యంలో ఇండియా కూటమి తలపెట్టిన సుప్రీంకోర్టు మార్చ్ కొనసాగుతుందా? నిరసన కార్యక్రమంలో ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటాయి? అనేది ఆసక్తికరంగా మారింది. ఎస్ఐఆర్, ఎన్నికల సంఘం తీరుపై కొనసాగుతున్న వివాదం ఈ పరిణామంతో మరో మలుపు తిరిగింది.

# ఢిల్లీలో ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించాలి

**న్యూఢిల్లీ:** సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఆందోళనలు, పోలీసులు విధించిన ఆంక్షలపై దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించింది. నగరంలో నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరించాలని, మెట్రో రైళ్లను యథావిధిగా నడపాలని కేంద్రం, ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. న్యాయవాదులు తమ వృత్తిపరమైన విధులు నిర్వర్తించకుండా అడ్డంకులు సృష్టించరాదని స్పష్టం చేసింది. నగరవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అనవసరమైన బారికేడ్లను తొలగించాలని సూచించింది. జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ చేపట్టింది. ఢిల్లీలో ఆందోళనల సందర్భంగా విధించిన ఆంక్షలకు సంబంధించి దాఖలైన కోర్టు ధిక్కార పిటిషన్లపైనా విచారణ జరిపింది. అన్ని పక్షాల వాదనలను పూర్తిగా వింటామని, జరిగిన పరిణామాలను తక్కువ చేసి చూడబోమని ధర్మాసనం పేర్కొంది. ఎవరికీ అనవసరమైన అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఢిల్లీలోని మొత్తం 303 మెట్రో స్టేషన్లలో 45 మాత్రమే మూసివేసినట్లు కోర్టుకు వివరించారు. కొన్ని స్టేషన్లు మూసివేసినప్పటికీ, సమీపంలోని ఇతర స్టేషన్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెట్రో స్టేషన్లను తెరిచి ఉంచుతామని, ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరిస్తామని, న్యాయవాదులు విధులు నిర్వర్తించకుండా అడ్డుకోబోమని కేంద్రం తరపున ఇచ్చిన హామీలను ధర్మాసనం రికార్డు చేసుకుంది. ప్రజా భద్రతకు సంబంధించిన పరిమితులకు లోబడి సాధారణ రాకపోకలు కొనసాగేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్న వాదనలనూ పరిగణనలోకి తీసుకుంది.



## ఆంక్షలపై అఫిడవిట్ దాఖలు చేయాలి

అక్టోబర్ 10న ఢిల్లీలో ఎలాంటి ఆంక్షలు విధించారు? వాటిని ఎందుకు అమలు చేశారు? అనే అంశాలపై వచ్చే వారం సమగ్ర వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇంటర్నెట్, మెట్రో సేవలను పునరుద్ధరించడంతో పాటు న్యాయవాదుల విధులకు ఆటంకాలు లేకుండా చూడాలని స్పష్టం చేసింది.

# అంబానీపై మస్క్ గురి!

**న్యూఢిల్లీ:** స్టార్‌లింక్ అధినేత ఎలాన్ మస్క్ భారత వ్యాపారవేత్త ముకేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకుని మరోసారి విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. తనను ప్రశ్నిస్తున్నవారిని 'అంబానీ దళారీ ఇంటర్నెట్ సైన్యం'గా అభివర్ణిస్తూ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. భారత్‌లో స్టార్‌లింక్ సేవలు అందుబాటులోకి వస్తే వినియోగదారులకు ఇంటర్నెట్ సేవల్లో మరిన్ని ఎంపికలు లభిస్తాయని పేర్కొన్నారు. ధరలు అధికంగా ఉంటే ప్రజలు వాటిని కొనుగోలు చేయరని, అందుకే సేవలను అందుబాటు ధరల్లోనే అందించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

భారత్‌లో అంబానీ సంస్థలు అందిస్తున్న ధరలతో స్టార్‌లింక్ పోటీపడలేదని ఒకవైపు చెబుతూ, మరోవైపు తమ సంస్థ బలమైన పోటీదారుగా అభివర్ణించడం పరస్పర విరుద్ధమని మస్క్ వ్యాఖ్యానించారు. ఇలాంటి వాదనల్లో అర్థం లేదని, అవి హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. స్టార్‌లింక్ ప్రవేశంతో భారతీయ వినియోగదారులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని, తద్వారా వారు ప్రయోజనం పొందుతారని తెలిపారు. దీనివల్ల అంబానీ లాభాలు కొంత తగ్గే అవకాశం ఉన్నప్పటికీ, ఆయన వ్యాపారం నుంచి పూర్తిగా వైదొలగరని అభిప్రాయపడ్డారు. భారత్‌లో స్టార్‌లింక్ సేవల ధరలు ఎక్కువగా ఉంటే వినియోగదారులు వాటిని ఎంచుకోరని, అందుకే ధరలను అందుబాటులో ఉంచాల్సి ఉంటుందని వివరించారు.

## భద్రతా అనుమతులపై స్పష్టత ఏదీ?

భారత్‌లో స్టార్‌లింక్ సేవలకు సంబంధించి భద్రతాపరమైన తనిఖీలు ఇంకా పూర్తికాలేదని ప్రభుత్వం గతంలో స్పష్టం చేసింది. అయితే, తాజా పోస్టులో మస్క్ ప్రధానంగా ధరలు, మార్కెట్ పోటీ అంశాలనే ప్రస్తావించారు. భద్రతాపరమైన అనుమతుల గురించి ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు.

ముకేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకుని మస్క్ గతంలోనూ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్, అల్‌జజీరా వార్తా కథనాలను పంచుకుంటూ వ్యాఖ్యలు చేశారు. అంబానీని 'నిజమైన భారత ప్రధాని' అంటూ వ్యంగ్యంగా పేర్కొన్న సందర్భాలూ ఉన్నాయి.భారత్‌లో ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్‌తో పాటు జియో శాటిలైట్ కమ్యూనికేషన్స్, భారతీ ఎయిర్‌టెల్‌కు చెందిన వన్‌వెబ్ దరఖాస్తు చేసుకున్నాయి. ఈ సంస్థలకు పూర్తిస్థాయి అనుమతులు లభించిన తర్వాతే సేవల ప్రారంభంపై స్పష్టత రానుంది. ఈ నేపథ్యంలో భారత శాటిలైట్ ఇంటర్నెట్ మార్కెట్‌లో పోటీ, ధరల నిర్ణయం అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# డబ్బుల కోసం ఆరేళ్ల చిన్నారి హత్య!

**బొల్లారం:** డబ్బు కోసం ఓ అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్ ఆరేళ్ల చిన్నారిని కిడ్నాప్ చేసి, దారుణంగా హత్య చేసిన ఘటన బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో కలకలం రేపింది. చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేసిన నిందితుడు.. చివరకు పాపను హత్య చేసి అపార్ట్‌మెంట్ సమీపంలోని నీటి సంపులో పడేశాడు. ఈ ఘటనపై తీవ్ర ఆవేదన వ్యక్తమవుతుండగా, ఎంపీ ఈటల రాజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌లో ఆరేళ్ల చిన్నారి ఆడుకుంటుండగా, అదే అపార్ట్‌మెంట్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న వ్యక్తి ఆమెను అపహరించినట్లు సమాచారం. అనంతరం చిన్నారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆ తర్వాత పాపను హత్య చేసి, అపార్ట్‌మెంట్ సమీపంలోని నీటి సంపులో పడేశాడు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని గుర్తించిన పోలీసులు.. సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు సమాచారం.

ఘటన గురించి తెలుసుకున్న ఎంపీ ఈటల రాజేందర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. డబ్బు కోసం చిన్నారి ప్రాణాలు తీయడం అత్యంత అమానుషమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.అపార్ట్‌మెంట్లు, కాలనీల్లో భద్రతపై యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈటల సూచించారు. వాచ్‌మెన్లు, పని మనుషులను నియమించుకునే సమయంలో వారి నేపథ్యం, గత చరిత్రను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. సెక్యూరిటీ ఏజెన్సీల ద్వారా సిబ్బందిని నియమించుకున్నప్పటికీ వారి వివరాలను ధ్రువీకరించుకోవాలని హితవు పలికారు.

### అమెరికా సీనియర్ కమాండర్ ఎదుటే..
# ఎఫ్–35పై ఐఏఎఫ్ చీఫ్ ఏపీ సింగ్ చురకలు

**న్యూఢిల్లీ:** అత్యాధునిక ఎఫ్–35 యుద్ధ విమానాలను భారత్‌కు విక్రయించేందుకు అమెరికా ఆసక్తి చూపుతున్నట్లు వార్తలు వస్తున్నప్పటికీ, ఈ విషయంలో ఇప్పటివరకు అధికారిక ప్రతిపాదన అందలేదని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. అమెరికా ఎఫ్ – 35 విమానాల వద్దకు భారత అధికారులను కూడా వెళ్లనివ్వరని, అలాంటప్పుడు వాటిని భారత్‌కు విక్రయించే అంశంపై ఎలా మాట్లాడతారని ఆయన వ్యాఖ్యానించారు. జోధ్‌పూర్‌లో నిర్వహించిన 'తరంగ్ శక్తి – 2026' ముగింపు కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో అమెరికా పసిఫిక్ వైమానిక దళాల కమాండర్ జనరల్ కెవిన్ ఆయన పక్కనే ఉండటం గమనార్హం. ఐదో తరం ఎఫ్ – 35 యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించి అమెరికా నుంచి అధికారిక ప్రతిపాదన ఏదైనా వచ్చిందా? అన్న ప్రశ్నకు ఐఏఎఫ్ చీఫ్ స్పందిస్తూ ఈ విషయాన్ని స్పష్టం చేశారు. రష్యా మాత్రం తన అత్యాధునిక ఐదో తరం స్టెల్త్ యుద్ధ విమానం సుఖోయ్ ఎస్‌యూ – 57ను భారత్‌కు అందించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. అయితే, ఆ విమానాన్ని కొనుగోలు చేసే అంశంపై భారత్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకో లేదని పేర్కొన్నారు. జోధ్‌పూర్‌లో నిర్వహించిన 'తరంగ్ శక్తి – 2026' వైమానిక విన్యాసాల్లో భారత వైమానిక దళంతో పాటు మరో ఏడు దేశాలకు చెందిన వైమానిక దళాలు పాల్గొన్నాయి.



## భాజపా బలోపేతానికి కృషి చేయాలి

**o కార్యకర్తలకు జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ పిలుపు**

**o జూలూరు గ్రామం నుంచి భాజపాలో చేరిన 20 మంది**

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, అవగాహన కల్పించాల్సిన బాధ్యత కార్యకర్తలపైనే ఉందని భాజపా యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి అశోక్ గౌడ్ అన్నారు. ఆదివారం పోచంపల్లి మండలంలోని జూలూరు గ్రామంలో నిర్వహించిన భాజపా మండల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన బండారి లక్ష్మణ్, దుర్గం నరసింహ, ఆర్కే నరసింహ, సంధిని సురేష్, సంధిని బాలయ్యలతో పాటు దాదాపు 20 మంది కార్యకర్తలు అశోక్ గౌడ్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి ఆయన పార్టీ కండువాలుప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... భారత దేశాన్ని ప్రపంచంలోనే అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ పాలన సాగుతోందన్నారు. గత 11 ఏళ్ల మోదీ పాలనలో దేశం అన్ని రంగాల్లోనూ వేగంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలే చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు డబ్బీకారు సాహేష్, జిల్లా నాయకులు మేకల చొక్కారెడ్డి, చిక్క కృష్ణ, చెరుకు వెంకటేష్, పల్లెకాడి బసవయ్య, గంజి బసవలింగం, శ్రీరామ లింగస్వామి, సురివి శ్రీనివాస్, కేసారం కృష్ణారెడ్డి, ముద్దం హరీష్, ఉప్పునూతల నరసింహ, గంగాదేవి విజయ్, రామిడి యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిష్టయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

**o రూ.లక్ష ఆర్థిక సహాయం అందించిన మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి**

**o అలీనగర్‌లో బాధితుడికి పరామర్శ**



**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** రైలు ప్రమాదంలో జీవనాధారమైన గొర్రెలను కోల్పోయి రోడ్డున పడిన బాలముని కిష్టయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇటీవల బీబీనగర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో గొర్రెలు మృతి చెందిన మండలంలోని అలీనగర్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బాలముని కిష్టయ్య కుటుంబాన్ని ఆదివారం ఆయన నాయకులతో కలిసి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని, తన వంతుగా రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కన్నబిడ్డల్లా సాదుకున్న గొర్రెలు ఒక్కసారిగా చనిపోవడంతో కిష్టయ్య కుటుంబం పూర్తి జీవనాధారాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితుడికి ప్రభుత్వం ప్రత్యేక పరిహారం అందించి భరోసా కల్పించాలని, స్వచ్ఛంద సంస్థలు కూడా ఆర్థికంగా తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన పలు కుటుంబాలను ఆయన పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, సీత వెంకటేష్, మాజీ సర్పంచ్ యాకరి రేణుక నర్సింగరావు, నాయకులు బత్తుల శ్రీశైలం గౌడ్, మన్నే పద్మా రెడ్డి, ఐతే రాజు, బిక్షపతి, వాకిటి మాధవరెడ్డి, దిండు శశాంక్, గునిగంటి మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఆగమనం.. కృష్ణలో సంబరం

**o మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ దుర్గామాత ఊరేగింపు**

**o భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం**

**o పురవీధుల్లో ఆధ్యాత్మిక సందడి**

**తొలివెలుగు, కృష్ణ :** మండల కేంద్రమైన కృష్ణలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల తొలిరోజు దుర్గామాత విగ్రహాన్ని మంగళవాయిద్యాలు, కోలాటాల నడుమ గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. అమ్మవారి ఆగమనంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఊరేగింపులో మహిళలు, పురుషులు, చిన్నారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కృష్ణతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలిరావడంతో పురవీధులు సందడిగా మారాయి. గ్రామ ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శరన్నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజూ ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.



# దివ్య వైభవంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు





**o పోచంపల్లి మండలవ్యాప్తంగా ఆధ్యాత్మిక శోభ**

**o బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చిన జగన్మాత**

**o మార్కండేయ ఆలయంలో చండీహోమం, కుంకుమార్చన**

**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** భూదాన్ పోచంపల్లి పట్టణంతో పాటు మండలవ్యాప్తంగా శ్రీ దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. నవరాత్రుల తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాలు, పూజా మండపాలు భక్తులతో సందడిగా మారడంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పట్టణంలోని మార్కండేయ స్వామి దేవాలయంలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చండీహోమం, కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి అనుగ్రహం కోసం భక్తులు ప్రార్థనలు చేశారు. పట్టణ కేంద్రంలోని పద్మశాలి వేదిక వద్ద శ్రీ దుర్గాదేవి 35వ శరన్నవరాత్రి ఉత్సవాలను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కర్నాటి గణేష్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్వజ ప్రదర్శన నిర్వహించడంతో పాటు అమ్మవారి ఆగమనాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీతా శ్రీరాములు, మాజీ సర్పంచ్ తడక లతా వెంకటేశ్వర్లు, మార్కండేయ స్వామి దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, దుర్గా ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పూల పండుగ వేళ.. కుల వివక్ష

**o ఆత్మకూర్ (ఎం) ఎస్సైకి అంబేద్కర్ యువజన సంఘం ఫిర్యాదు**

**o ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్**

**తొలివెలుగు, ఆత్మకూర్ (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ (ఎం) మండలంలోని టి. రాపాక గ్రామంలో బతుకమ్మ పండుగ సందర్భంగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన మహిళలను కులం పేరుతో దూషించి, బతుకమ్మ ఆడకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ అంబేద్కర్ యువజన సంఘం, ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేయాలని ఎస్సైని కోరారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. అక్టోబర్ 10న సాయంత్రం 7 గంటల సమయంలో టి.రాపాక గ్రామానికి చెందిన ఎస్సీ మహిళలు బతుకమ్మలతో ఊరి బండ సమీపంలో వేడుకల్లో పాల్గొనేందుకు వెళ్లగా, కొందరు వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ అడ్డుకున్నారని ఆరోపించారు. అక్కడితో ఆగకుండా లైట్లు, డీజే సౌండ్లు నిలిపివేసి అవమానపరిచారని పేర్కొన్నారు. ఈ



ఘటనలో కట్కూరు పద్మారెడ్డి, ఏనుగు బిక్షం రెడ్డి, ఏనుగు నర్సిరెడ్డి, యాస మహేశ్వరి, ఏనుగు మేఘన, కోట జయలక్ష్మి, పిక్క మల్లయ్య, జక్కు దామోదర్ రెడ్డిల పాత్రపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిమజ్జనం తర్వాత కూడా తమ కుటుంబ సభ్యులపై దాడికి యత్నించారని, బాధిత కుటుంబాలకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.

# కన్నవారి జ్ఞాపకార్థం.. సమాజహితం

**o రూ.18 లక్షల సొంత నిధులతో స్మశానవాటికలో మౌలిక సదుపాయాలు**

**o తల్లిదండ్రుల జ్ఞాపకార్థం షెడ్డు, స్నానపు గదులు, అంత్యక్రియల వేదిక నిర్మాణం**

**o సైంటిస్ట్ అంకతి రాజును ఘనంగా సన్మానించిన పెరిక కులస్థులు**

**తొలివెలుగు, రాజాపేట :** కన్నవారిపై ఉన్న ప్రేమను సమాజహిత కార్యక్రమంగా మలిచి ఆదర్శంగా నిలిచారు సైంటిస్ట్ అంకతి రాజు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల కేంద్రంలోని పురగిరి క్షత్రియ (పెరిక) కులస్థుల స్మశానవాటికలో తన తల్లిదండ్రులు దివంగత అంకతి పెద్ద నరసయ్య, లక్ష్మి జ్ఞాపకార్థం రూ.18 లక్షల సొంత నిధులతో మౌలిక సదుపాయాలను కల్పించారు. స్మశానవాటికలో షెడ్డు, స్నానపు గదులు, అంత్యక్రియల వేదికను నిర్మించారు. నూతనంగా నిర్మించిన ఈ సదుపాయాలను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పెరిక కుల సంఘం నాయకులు, కులపెద్దలు దాత అంకతి



రాజును పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. స్మశానవాటికలో అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆప్తులను కోల్పోయి విషాదంలో ఉండే కుటుంబాలకు ఈ నిర్మాణాలు ఎంతగానో ఉపయోగపడతాయని కొనియాడారు. తల్లిదండ్రుల జ్ఞాపకాలను పదిలపరుచుకోవడంతో పాటు సమాజానికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమం చేపట్టడం పలువురికి స్ఫూర్తిదాయకమని కుల సంఘం ప్రతినిధులు అన్నారు. ఈ కార్యక్రమంలో పెరిక కుల సంఘం అధ్యక్షుడు బెడిద నర్సింహులు, ప్రధాన కార్యదర్శి అంకతి బిక్షపతి, సంఘం పెద్దలు మేడిశెట్టి సత్యనారాయణ, అంకతి బాలయ్యతో పాటు కులస్థులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలి

**o రామన్నపేటలో 'మన ఓటు - మన గొంతుక' ప్రచారం**

**o తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కార్యక్రమం**

**o రాష్ట్ర సాధన కోసం త్యాగాలు చేసిన వారి సమస్యలకు వేదిక కల్పించాలని డిమాండ్**

**తొలివెలుగు, రామన్నపేట :** శాసనమండలిలో తెలంగాణ ఉద్యమకారుల గొంతుక వినిపించేలా వారికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం రామన్నపేటలో ఫోరం ఆధ్వర్యంలో 'మన ఓటు - మన గొంతుక' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమకారులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తించాలని కోరారు. రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు శాసనమండలిలో అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి ఆకాంక్షలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్.కె. చాంద్, మండల అధ్యక్షుడు నోముల శంకర్, ఉపాధ్యక్షుడు బొడ్డుపల్లి లింగయ్య, జిల్లా నాయకులు రెబ్బాసు రాములు, డాక్టర్ కొండ మల్లేశం గౌడ్, గడ్డం యాదగిరి, చోల్లేటి పాండురంగాచారి, మాజీ ఉపసర్పంచ్ గంగాపురం యాదయ్య, మద్దే గల నరసింహ, కైరం కొండ సంతోష్, పెండం రవీందర్, సైలాబ్, బిక్షంతో పాటు పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.



# మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలి





**ం నైపుణ్యాభివృద్ధితో స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవాలి**

**ం ఉచిత కుట్టు శిక్షణ పూర్తి చేసిన మహిళలకు ధ్రువపత్రాల అందజేత**

**ం ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి**

**తొలివెలుగు, చంపాపేట:** మహిళలు తమ నైపుణ్యాలను పెంపొందించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు. చంపాపేట డివిజన్ యువ నాయకురాలు సంధ్య రవి ముదిరాజ్ అధ్యక్షతన స్థానిక మోడల్ మార్కెట్ భవనం ఆవరణలో గత కొన్ని రోజులుగా ఉచిత కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన మహిళలకు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కమల సుధీర్‌రెడ్డి చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల చేతిలో నైపుణ్యం ఉంటే కుటుంబం ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతుందని, కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజం కూడా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళలు ఇతరులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుట్టు శిక్షణలో ప్రాథమిక స్థాయి నుంచి ఆధునిక పద్ధతుల వరకు నేర్పిస్తున్నామని, బ్యూటీషియన్, మెహందీ వంటి ఉపాధికి ఉపయోగపడే ఇతర కోర్సుల్లోనూ శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. శిక్షణ పూర్తి చేసిన మహిళలు ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి ప్రారంభించి కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరుచుకోవాలని సూచించారు. మహిళల నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక స్వావలంబనకు ప్రాధాన్యమిస్తూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రమాదేవి, ఉష, ప్యారి, కవిత, లావణ్య, స్వయం ప్రభు, ట్రస్ట్ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, శిక్షణ పొందిన మహిళలు, స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## బడంగ్‌పేట్‌లో 'జై మల్లన్న మోటార్స్' ప్రారంభం

**ం షోరూమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**ం వాహనదారులకు అందుబాటులోకి టూ వీలర్ మల్టీ బ్రాండ్ సేవలు**

**తొలివెలుగు, బడంగ్‌పేట్ :** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'జై మల్లన్న మోటార్స్' టూ వీలర్ మల్టీ బ్రాండ్ షోరూమ్‌ను మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. నిర్వాహకుడు మహేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ షోరూమ్‌లో వివిధ కంపెనీలకు చెందిన ద్విచక్ర వాహనాల విక్రయాలతో పాటు పాత వాహనాల మార్పిడి (ఎక్స్ఛేంజ్) సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ?ఈ సందర్భంగా స్థానిక నాయకులు, వ్యాపారవేత్తలు మాట్లాడుతూ.. బడంగ్‌పేట్ పరిసర ప్రాంతాల ప్రజలకు, వాహనదారులకు ఈ షోరూమ్ ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. స్థానికంగా నూతన వ్యాపార సంస్థల రాకతో వ్యాపార రంగం విస్తరించడమే కాకుండా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, వ్యాపారవేత్తలు, యువత పాల్గొని నిర్వాహకుడు మహేశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# దివ్య శోభితం.. శరన్నవరాత్రోత్సవం

**ం చిట్యాల మండలవ్యాప్తంగా అంబరాన్నంటిన దేవీ ఉత్సవాలు**

**ం శ్రీ బాలా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు**

**ం కనకదుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు**



**తొలివెలుగు, చిట్యాల :** చిట్యాల మండలవ్యాప్తంగా ఆదివారం శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక శోభతో వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఆలయాలు, నవరాత్రి మండపాలు భక్తులతో సందడిగా మారాయి. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయాల్లో పండితులు గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన తదితర క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించి నవరాత్రి వేడుకలకు శ్రీకారం చుట్టారు. చిట్యాలలోని కనకదుర్గాలయంలో నిర్వహించిన నవరాత్రి ఉత్సవాల ప్రారంభ వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే దంపతులకు సాదరంగా స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఆలయాల వద్ద ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్, చిట్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పందిరి గీతా రమేష్, వైస్ చైర్‌పర్సన్ గుండెబోయిన శ్రీలక్ష్మీ సైదులు, ఆలయ కమిటీ సభ్యులు గంజి వెంకటేశం, బుద్ధ విమల, వరకాంతం నర్సిరెడ్డి, రుద్రారపు లింగస్వామి, జిట్టా సాయిలు, బెలిజ సత్యనారాయణ, ఏళ్ల మాధవి, కుమ్మరిదేవి రవి, కౌన్సిలర్లు ఏర్పుల పరమేష్, కుక్కల మోహన్, నాగిళ్ల సుధాకర్, గాలి యాదమ్మ, బొబ్బల సందీప, దేశపాక లత తదితరులు పాల్గొన్నారు.

## అప్పం సోమరాజు మృతి పట్ల కాంగ్రెస్ నాయకుల సంతాపం

**ం జర్నలిస్టు చెన్నకేశవ తండ్రి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు**

**ం కుటుంబ సభ్యులకు పరామర్శ**



**తొలివెలుగు,రామన్నపేట :** స్థానిక వార్తా విలేఖరి అప్పం చెన్నకేశవ తండ్రి అప్పం సోమరాజు (70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రామన్నపేటలోని ఆయన నివాసానికి చేరుకున్న నాయకులు సోమరాజు మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శోకసంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ?సోమరాజు ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. నివాళులర్పించిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మొహమ్మద్ జమీరుద్దీన్, ఉపసర్పంచ్ మోటె రమేష్, కాంగ్రెస్ నాయకులు సాల్వేర్ అశోక్, గుత్తా నర్సిరెడ్డి, బొడ్డు సాలయ్య, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, జెల్లా వెంకటేశం, మొహమ్మద్ అక్రమ్, కోట సుధాకర్, లెంకల ప్రవీణ్, కొమ్ము శేఖర్, బండ లింగస్వామి, నకరికంటి సుదర్శన్, మినుముల సందీప్ తదితరులు ఉన్నారు.

## శ్రీ బాలాత్రిపుర సుందరీదేవిగా దుర్గమ్మ దర్శనం

**ం నీర్నేములలో శరన్నవరాత్రోత్సవాల శుభారంభం**

**ం 11వ వార్షికోత్సవాల్లో భక్తుల ప్రత్యేక పూజలు**

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని నీర్నేముల గ్రామంలో శ్రీ దుర్గాదేవి 11వ వార్షిక శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు అమ్మవారు శ్రీ బాలాత్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని పండితులు అమ్మవారికి వేద మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక వేడుకల్లో శ్రీ విఘ్నేశ్వర యూత్ అసోసియేషన్ ప్రతినిధులు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి పుష్పార్చనలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు నిత్య పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.






## సంస్కృతికి ప్రతీక.. 'మార్గదర్శి'లో బతుకమ్మ వేడుక

**ం గుడేబల్లూర్ బడిలో అంబరాన్నంటిన 'ఎంగిలిపూల' సంబరం**

**ం కృష్ణా నదిలో శోభాయమానంగా నిమజ్జనం**

**తొలివెలుగు, కృష్ణ :** కృష్ణా మండల పరిధిలోని గుడేబల్లూర్ గ్రామంలో ఉన్న మార్గదర్శి పాఠశాలలో ఆదివారం బతుకమ్మ సంబరాలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు రంగురంగుల పువ్వులతో ఎంగిలిపూల బతుకమ్మలను అందంగా పేర్చారు. పాఠశాల ప్రాంగణంలో బతుకమ్మలను ఉంచి దారిపొడవునా ఆటపాటలు, కోలాటాలతో అలరించారు. అనంతరం బతుకమ్మలను పురవీధుల గుండా ఊరేగింపుగా తీసుకెళ్లి కృష్ణా నదిలో భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఈ వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ డి. నరసింహులు, యాజమాన్య అధ్యక్షుడు ప్రహ్లాద రెడ్డి, హెచ్‌ఎం ప్రసాద్ రెడ్డి, ప్రిన్సిపల్ భీమ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ శ్రీలత రెడ్డి, కోశాధికారి పూజారి లక్ష్మణ్, ఉపాధ్యాయులు నవీన్, లక్ష్మణ్, సురేష్, చైత్ర, వర్ష, భవాని, నికిత, మహేశ్వరి, రేణుక, నాగమ్మ తదితరులతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



## దుర్గమ్మ చెంత.. మాజీ ఎమ్మెల్యే 'చిరుమర్తి'

**ం ఇంద్రపాలనగరంలో భక్తిశ్రద్ధలతో దేవీ నవరాత్రోత్సవాలు**

**ం బాలా త్రిపుర సుందరీదేవికి ప్రత్యేక అర్చనలు**

**తొలివెలుగు, రామన్నపేట :** రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో శ్రీ దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శ్రీ బాలా త్రిపుర సుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారిని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జగన్మాత దివ్య ఆశీస్సులతో ప్రజలందరూ అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో తులతూగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గర్దాస్ విక్రమ్, ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, మాజీ సర్పంచులు కాటేపల్లి సిద్ధమ్మ యాదయ్య, రేపాక పారిజాత యాదయ్య, పుట్టల లక్ష్మమ్మ ముత్యాలు, బీఆర్ఎస్ మండల నాయకులు మందడి విద్యాసాగర్‌రెడ్డి, మంటి లింగస్వామి, రాస వెంకటేశం, గర్దాస్ కరుణాకర్, నక్క వెంకటేశ్, గోళ్లేపల్లి యాదయ్య, చిన్నపాక సురేశ్, నీరుడు నరేశ్, రాధారపు శ్రీనివాస్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బొల్ల మత్స్యగిరి, పగుడాల ఉపేందర్, భువనగిరి మధు, వడ్లకొండ చంద్రశేఖర్, జిట్టబోయిన నవీన్ తదితరులు పాల్గొన్నారు.



## కిసాన్ సంఘ్ మండల కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా ఆకుల వెంకన్న, పోకల స్వామి
- వరంగల్ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలని డిమాండ్

**తొలివెలుగు, చిట్యాల :** భారతీయ కిసాన్ సంఘ్ చిట్యాల మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానిక శివాలయంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ్ జిల్లా అధ్యక్షుడు అనంతరెడ్డి తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఆకుల వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా పోకల స్వామి, కోశాధికారిగా కొణతం సత్తిరెడ్డిని ఎన్నుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అనంతరెడ్డి మాట్లాడుతూ.. ఎల్నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో వరంగల్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన రైతు హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘటన రాష్ట్ర కార్యదర్శి ఫైల్లా సత్తిరెడ్డి, యాదాద్రి భువనగిరి జిల్లా కిసాన్ సంఘ్ అధ్యక్షుడు పోకల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## మొల్లగూడెంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- లబ్ధిదారులకు కార్డులు అందజేసిన సర్పంచ్ బాలరాజ్‌రెడ్డి
- కార్యక్రమంలో పాల్గొన్న ఉపసర్పంచ్, వార్డు సభ్యులు





**తొలివెలుగు, రాజాపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండల పరిధిలోని మొల్లగూడెం గ్రామంలో ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సర్పంచ్ జెన్నపల్లి బాలరాజ్‌రెడ్డి, ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవితారాజు పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు కొత్త కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించాలనే లక్ష్యంతో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్డుల ద్వారా ప్రజలకు రేషన్ సరుకుల పంపిణీలో మరింత సౌలభ్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నీల కనకమ్మ రాములు, గొడుగు బ్రహ్మయ్య, నీల జహంగీర్, గొడుగు కల్పన కనకయ్య, బోయిని నాగరాజు, చౌక ధరల దుకాణ డీలర్ గంగిశేటి రాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పంతంగిలో రెండు బోర్లకు భూమిపూజ

- మంజురు చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- ప్రారంభించిన సర్పంచ్ శ్రీలత సుందర్, వివిధ పార్టీల నాయకులు

**తొలివెలుగు, చౌటుప్పల్ :** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రత్యేక నిధులతో చౌటుప్పల్ మండల పరిధిలోని పంతంగి గ్రామానికి రెండు కొత్త బోర్ల మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం గ్రామంలో ఏర్పాటు చేసిన బోరు పాయింట్లను గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్ కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు. గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి ఈ సందర్భంగా నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోయ సదానందం, వార్డు సభ్యులు సప్పిడి లింగారెడ్డి, సప్పిడి ప్రభాకర్‌రెడ్డి, మధగోని శంకర్ పరమేశ్వరి, బోయ హారిక కిరణ్, గుండేపురం ప్రతిభ నరేష్, బండ శేఖర్, రత్నం శ్రీకాంత్, బాతరాజు వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, మాజీ సర్పంచ్ అంతటి రమేష్‌గౌడ్, మాజీ ఉపసర్పంచ్ బోయ అంబేద్కర్, దూసరి వెంకటేష్‌గౌడ్, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కడగంచి చలమందరాజు, రామాలయం ఛైర్మన్ కడగంచి జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయ వెంకట్, ఎమ్మార్పీఎస్ నాయకులు బోయ లింగస్వామి, కాంగ్రెస్ నాయకులు కడగంచి వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఆడపడుచుల ఆత్మీయతకు 'బతుకమ్మ' ప్రతీక



- రాజాపేట మార్కండేయ ఆలయంలో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు
- ఒకే రంగు దుస్తుల్లో మహిళల కోలాటాలు, దాండియా ఆటలు
- బతుకమ్మతో మహిళల్లో ఆత్మీయత, ఐకమత్యం పెంపొందుతాయి
- సొసైటీ డైరెక్టర్ ఆడెపు రమాదేవి

**తొలివెలుగు, రాజాపేట :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ ఉత్సవాల నిర్వహణ వల్ల మహిళల్లో ఆత్మీయత, ఐకమత్యం పెంపొందుతాయని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) డైరెక్టర్ ఆడెపు రమాదేవి పేర్కొన్నారు. రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ భక్త మార్కండేయ దేవాలయ ఆవరణలో ఆదివారం ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తంగేడు, గునుగు, పసుపు, నారింజ, తెలుపు, ఎరుపు రంగు రంగుల పూలతో బతుకమ్మలను శోభాయమానంగా పేర్చారు. మహిళలంతా ఏకరూప (సేమ్ కలర్) దుస్తులు ధరించి బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద గేయాలు పాడారు. అనంతరం నిర్వహించిన కోలాటం, దాండియా ఆటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం సొసైటీ డైరెక్టర్ ఆడెపు రమాదేవి మాట్లాడుతూ.. పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ మన విశిష్ట సంస్కృతికి ప్రతిబింబమన్నారు. ఇరుగుపొరుగు మహిళలంతా కలిసిమెలిసి సంబరాలు జరుపుకోవడం వల్ల సోదరభావం బలపడుతుందని తెలిపారు. భావితరాలకు మన సంప్రదాయాలను అందించడంలో ఈ వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని మహిళలు ఆనందం వ్యక్తం చేశారు.

## రూటు మార్చిన ఆటో డ్రైవర్.. భయంతో దూకేసిన బాలికలు

- నకిరేకల్‌లో కలకలం రేపిన ఘటన
- ప్రాణభయంతో కదులుతున్న ఆటో నుంచి దూకిన ఇద్దరు బాలికలు
- గాయపడిన బాధితులకు ఆసుపత్రిలో చికిత్స.. ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు




**తొలివెలుగు, నకిరేకల్:** ఆటో డ్రైవర్ మార్గం మార్చడంతో అనుమానం, భయాందోళనలకు గురైన ఇద్దరు మైనర్ బాలికలు కదులుతున్న ఆటో నుంచి కిందకు దూకిన ఘటన నకిరేకల్ పరిసరాల్లో కలకలం రేపింది. ఈ ఘటనలో గాయపడిన బాలికలకు ఆసుపత్రిలో చికిత్స అందించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. హైదరాబాద్ నుంచి బస్సులో బయలుదేరిన ఇద్దరు మైనర్ బాలికలు తమ గమ్యస్థానానికి ముందుగానే నకిరేకల్ సమీపంలో దిగారు. అక్కడి నుంచి తమ స్వగ్రామమైన ఊట్కూర్‌కు వెళ్లేందుకు ఆటో ఎక్కారు. అయితే, డ్రైవర్ వారిని ఊట్కూర్ వైపు తీసుకెళ్లకుండా ఇనుపాముల మార్గంలో తీసుకెళ్తుండటంతో బాలికలకు అనుమానం కలిగింది. దీనికితోడు డ్రైవర్ ఫోన్‌లో మరొకరితో మాట్లాడుతూ ప్రయాణిస్తుండటంతో వారు మరింత ఆందోళనకు గురయ్యారు. ఆటో వెళ్తున్న మార్గంపై అనుమానం రావడంతో ప్రమాదం జరగవచ్చని భావించిన బాలికలు కదులుతున్న ఆటో నుంచి కిందకు దూకారు. ఈ ఘటనలో గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

**పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు**

ఘటన అనంతరం బాలికలు నకిరేకల్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆటో డ్రైవర్ ఎవరు? బాలికలను వేరే మార్గంలోకి ఎందుకు తీసుకెళ్లాడు? ఘటనకు దారితీసిన పరిస్థితులు ఏమిటి? అనే అంశాలపై పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది. దర్యాప్తు పూర్తయిన తర్వాత ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

## మునుగోడులో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు





- నియోజకవర్గం నలుమూలల నుంచి తరలివచ్చిన వేలాది మంది మహిళలు
- ఆడపడుచులతో కలిసి బతుకమ్మ ఆడిన కోమటిరెడ్డి లక్ష్మి
- కుటుంబ సమేతంగా వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి
- 15 అడుగుల బతుకమ్మకు ప్రత్యేక పూజలు.. మహిళలకు విందు భోజనాలు

**తొలివెలుగు, మునుగోడు:** తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు మునుగోడులో అంగరంగ వైభవంగా జరిగాయి. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ వేడుకలకు నియోజకవర్గం నలుమూలల నుంచి వేలాది మంది మహిళలు కుటుంబ సమేతంగా తరలివచ్చారు. రంగురంగుల పూలతో అలంకరించిన బతుకమ్మలు, మహిళల ఆటపాటలు, జానపద గీతాలతో వేడుకల ప్రాంగణం సందడిగా మారింది. మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి మహిళలు బతుకమ్మలతో వేడుకల ప్రాంగణానికి చేరుకున్నారు. కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ కోమటిరెడ్డి లక్ష్మి వేదమంత్రాల నడుమ పూజలు నిర్వహించి, 15 అడుగుల భారీ బతుకమ్మకు హారతి ఇచ్చారు. అనంతరం మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా వేడుకల్లో పాల్గొన్నారు. మహిళలతో కలిసి కోమటిరెడ్డి లక్ష్మి బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. గుమ్మడి, తంగేడు, గునుగు, బంతి తదితర పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల మధ్య మహిళలు సంప్రదాయ పాటలు పాడుతూ ఉత్సాహంగా నృత్యాలు చేశారు. పల్లె జానపద గీతాల నుంచి ఆధునిక పాటల వరకు బతుకమ్మ పాటలకు అనుగుణంగా కోలాహలంగా వేడుకలు సాగాయి. బతుకమ్మ ఆడుతున్న మహిళల వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వారిని ఆప్యాయంగా పలకరించారు. తమ అభిమాన నాయకుడిని కలుసుకున్న మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి లక్ష్మి మాట్లాడుతూ.. బతుకమ్మ కేవలం పూల పండుగ మాత్రమే కాదని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, మహిళల ఐక్యతకు ప్రతీక అని అన్నారు. మహిళల సంతోషం, కుటుంబాల సంక్షేమం, తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకలను ఘనంగా నిర్వహించామని పేర్కొన్నారు. మునుగోడు నియోజకవర్గంలోని ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలని, ఆడపడుచులు ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, గ్రామాలు అభివృద్ధి చెందాలని, తెలంగాణ సంస్కృతి తరతరాలకు ఆదర్శంగా నిలవాలని కోరుకున్నారు. వేడుకలకు హాజరైన మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. బతుకమ్మ ఆడి అలసిన మహిళలు భోజనాలు చేసిన అనంతరం తమ ఇళ్లకు తిరిగి వెళ్లారు. నియోజకవర్గవ్యాప్తంగా మహిళలతో పాటు పలువురు ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.





## గొర్రెల పెంపకందారులకు కొత్త మార్కెట్ యార్డు

- చౌటుప్పల్‌లో రూ.50 లక్షలతో నిర్మాణం
- నూతన మార్కెట్ యార్డును ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్‌గౌడ్
- గొర్రెలు, మేకల కొనుగోళ్లు, అమ్మకాలకు మెరుగైన వసతులు

**తొలివెలుగు, చౌటుప్పల్:** గొర్రెలు, మేకల పెంపకందారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన గొర్రెలు, మేకల మార్కెట్ యార్డు సంతను మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్‌గౌడ్ ప్రారంభించారు. వలిగొండ రోడ్డులోని శివాలయం పక్కన ఏర్పాటు చేసిన ఈ మార్కెట్ యార్డు అందుబాటులోకి రావడంతో పశువుల కొనుగోళ్లు, అమ్మకాలకు ఇబ్బందులు తగ్గనున్నాయి. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. చౌటుప్పల్‌లో గతంలో నిర్వహిస్తున్న గొర్రెల సంతలో సరైన వసతులు లేక పెంపకందారులు, కొనుగోలుదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమస్యను దృష్టిలో పెట్టుకొని రూ.50 లక్షలతో నూతన మార్కెట్ యార్డును నిర్మించినట్లు పేర్కొన్నారు. గొర్రెలు, మేకల పెంపకందారులు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ ఈడుదుల మస్తాన్‌బాబు యాదవ్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో గొర్రెలు, మేకల కొనుగోళ్లు, అమ్మకాలు నిర్వహించేందుకు సరైన వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నూతన మార్కెట్ యార్డు అందుబాటులోకి రావడంతో పెంపకందారులకు, వ్యాపారులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని అన్నారు. మార్కెట్ యార్డును సద్వినియోగం చేసుకొని వ్యాపార కార్యకలాపాలను సులభతరం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు పాక చిరంజీవి, బత్తుల జయమ్మ దాస్, ఉమ్మడి నల్గొండ జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార యూనియన్ డైరెక్టర్ బండారు నరసింహ, గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) చౌటుప్పల్ మండల అధ్యక్షుడు భీమనగోని బాలరాజు, కార్యదర్శి కొండే శ్రీశైలం, మున్సిపల్ కన్వీనర్ గుణమోని ఐలయ్య, సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నారీ వెంకటేశం, నాయకులు గజ్జి పాండు, జనిగల యాదయ్య, బద్దుల వెంకటేశం, గడగోటి జంగయ్య, జనిగల శ్రీశైలం, గోపనబోయిన జంగయ్య, ఈదుల హరిప్రసాద్, ఎర్రగోని ఐలయ్య, అరిగె కిష్టయ్య, బాలెం శంకరయ్య, యాదవ సంఘం మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ్, ఎర్రసాని విజయ్‌కుమార్, నల్ల పర్వతాలు యాదవ్, గంగన్న, బోయిన వెంకటేశ్ యాదవ్, చినుకని యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- చౌటుప్పల్ సీతారామచంద్రస్వామి ఆలయంలో వేడుకలకు శ్రీకారం
- బాలా త్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ దంపతులు





**తొలివెలుగు, చౌటుప్పల్:** చౌటుప్పల్ భవానీనగర్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించనున్నారు. తొలిరోజు అమ్మవారు బాలా త్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల తొలిరోజు చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ రమేష్‌గౌడ్ దంపతులు, 19వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్--అనిత దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు పెద్ది సుధాకర్ శర్మ, పెద్ది కిషోర్ శర్మ శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఈడుదుల మస్తాన్‌బాబు యాదవ్, కౌన్సిలర్లు కాసర్ల మంజుల-శ్రీనివాస్‌రెడ్డి, చింతల ఉమామహేశ్వరి-సాయిలు, పాక చిరంజీవి, కొసనం రాకేష్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తలు వర్కాల రవి, వెన్నెలగౌడ్, ఆవుల యేసు యాదవ్, దాడి యశ్వంత్‌రెడ్డి, గుగులోతు అరుణ-శంకర్‌నాయక్, బొంగు జంగయ్యగౌడ్, సుర్వి నరసింహగౌడ్, ఉప్పల కుసుమ-కృష్ణ దంపతులు, చింతల కరుణ-తిరుమల్‌రెడ్డి దంపతులు, కొసనం అనురాధ-రామిరెడ్డి దంపతులు, దాచేపల్లి లక్ష్మి-ప్రకాశ్ దంపతులతో పాటు ప్రముఖ పాత్రికేయులు సామిడి రాఘవరెడ్డి, బత్తుల శ్రీశైలం గౌడ్, దేవరపల్లి గోవర్ధన్‌రెడ్డి, గుర్రం వెంకటేశం, ఉడుగు రమేష్‌గౌడ్, గుజ్జుల రవీందర్‌రెడ్డి, కంచరకుంట్ల శశిధర్‌రెడ్డి, బాల్యం వెంకటాచలం, బొబ్బిళ్ల శ్రీరాములు, బొబ్బిళ్ల రాజేందర్, రావుల స్వామి, ఉడుగు మల్లేష్‌గౌడ్, మునుకుంట్ల సత్యనారాయణగౌడ్, బుడిగె బాలకృష్ణగౌడ్, చెరుకు లింగస్వామిగౌడ్, కాసుల వెంకటేష్‌గౌడ్, చింతకింది గణేష్‌గౌడ్, వీసం చంద్రారెడ్డి, కర్నాటి శ్యామ్, మునుకుంట్ల జంగయ్యగౌడ్, సుర్వి మహేష్‌గౌడ్, వర్కాల రాము గౌడ్, వర్కాల కుమార్‌గౌడ్, బొబ్బిళ్ల సామ్రాట్, పెద్దగోని రమేష్‌గౌడ్, మార సంగమేశ్వర్, మామిడి శివగౌడ్, యాట సంతోష్, నల్ల బాలరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. ఈ నెల 21వ తేదీ వరకు జరిగే శరన్నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బిళ్ల మురళి గురుస్వామి కోరారు.

# ఉమ్మడి పౌర ప్రవర్తన




'ఎవరు నేర్పేరమ్మ ఈ కొమ్మకూ, పూలిమ్మనీ రెమ్మరెమ్మకూ; ఎంత తొందరలే హరి పూజకు, పొద్దుపొడవకముందె పూలిమ్మనీ'-- అంటూ ఆశ్చర్యపోతారు దేవులపల్లి కృష్ణ శాస్త్రి ఓ సినీగీతంలో! నిజమే, పూలిమ్మని రెమ్మరెమ్మనూ ఎవరు శాసించారు, ఏ చట్టం కొట్టి చెప్పింది? సృష్టిలోని సకలజీవులూ ఒకరికొకరు సహకరించుకుంటూ, ఒకరినొకరు గౌరవించుకుంటూ ఉమ్మడిగా సుఖజీవనం సాగించడానికి ప్రకృతి చేసిన ఏర్పాట్లలో ఒకటి కదా అది! పట్టిచూస్తే తప్ప అర్థం కాని, మన అవగాహనకు అందని ప్రకృతి విశాల ప్రణాళికలో అది భాగం కదా! బుర్రలేదనుకునే పక్షీ, పశువూ, చెట్టూ, పుట్టా, రాయీ, రప్పా సైతం ప్రాకృతిక న్యాయంలో భాగమైనప్పుడు బుర్ర ఉందనుకునే మనిషి ఎందుకు కాడు?! సంస్కృతీ, నాగరికతా మార్గంలో వేల సంవత్సరాల ప్రస్థానం తర్వాత, ఇప్పటికైనా అయ్యాడా? అందులో ప్రకృతి ప్రణాళికకు పెడగా పడిన అడుగులెన్ని! జీవం మనిషిగా ఎదిగిన మొదట్లో చట్టాలు లేవు; మనుగడలో భాగంగా సాటి మనిషితో జతకట్టాడు, గుంపుగా ఎదిగాడు, అనేక గుంపులతో కలసి సామరస్యంగా సహజీవనం చేసే స్థాయికి చేరాడు. తన అస్తిత్వంలో ఎక్కువకాలం అలిఖిత శాసనాలే మనిషిని నడిపించాయి; మంచీ, మర్యాదా మప్పాయి; నీతీ, రీతీ నేర్పాయి; సభ్యత, శుభ్రత అలవరచాయి. అయినా ఇప్పటికీ ఆ ప్రక్రియ పూర్తి కాలేదు. అవినీతి, అసభ్యత, అక్రమాల అధఃపాతాళపు లోతులు చూస్తూనే ఉన్నాడు. ప్రకృతిమార్గం నుంచి తప్పుకుని సృష్టికి ప్రతిసృష్టి చేసే ప్రావీణ్యం విర్రవీగడమే అందుకు కారణమా?! మానవ జనావాసాలు గుంపు దశనుంచి నగరాలుగా ఎదిగే క్రమంలో లిఖిత శాసనాలు వచ్చాయి. అయిదువేల సంవత్సరాల క్రితం ప్రాచీన సుమేరు నాగరికతా కాలంలో తెచ్చిన 'ఉర్--నమ్ము' అనే శిక్షాస్మృతిని తొలి స్మృతిగా చెబుతారు. ఆ తర్వాత క్రీ.పూ. 1750లో, బాబిలోనియా పాలకుడు హమ్మురాబి పేరిట శిక్షాస్మృతి వచ్చింది. ఆ తర్వాత క్రీ.పూ. 451లో 'లా ఆఫ్ ట్వెల్వ్ టేబుల్స్' పేరిట రోమన్ చట్టాలు వచ్చాయి. వాటిని క్రోడీకరిస్తూ క్రీ.శ. 529లో జస్టీనియన్ శిక్షాస్మృతిని తెచ్చారు. ఆధునిక పౌరచట్టాలనూ, వ్యవస్థలనూ అదే ప్రభావితం చేసిందంటారు. మన దగ్గర క్రీ.పూ. 400లో అర్థశాస్త్రం, ఆ తర్వాత మనుస్మృతితో సహా వివిధ స్మృతులు వచ్చి మానవ ప్రవర్తనను కట్టడి చేయడానికి ప్రయత్నించాయి. కులమతవర్గ భేదాలను దాటుకుంటూ ప్రజాస్వామ్యం దిశగా అడుగువేస్తున్న వర్తమానంలో ఈ ప్రాచీన స్మృతులు మంచి--చెడుల కలబోతగా కనిపించ డంలో ఆశ్చర్యం లేదు. క్రీస్తుశక ప్రారంభంలో మౌర్యచక్రవర్తి అశోకుడు 'ధర్మస్తంభా'ల పేరిట దేశమంతటా స్థాపించిన లిఖిత శిలాస్తంభాలు జంతుబలుల నిషేధంతో సహా ఆయా విధినిషేధాలను శాసిస్తూనే; సత్కార్యాలను, దయను, దాతృత్వాన్ని, సత్యనిష్ఠను, పరిశుద్ధతను బోధించాయి; క్రౌర్యాన్ని, కోపాన్ని, గర్వాన్ని విడిచిపెట్టమనీ; అన్ని మతా లను, పంథాలను గౌరవించమనీ చెప్పాయి. మనిషి ప్రవర్తనను చట్టాలూ, శిక్షలతోనే కాదు; తగిన హితబోధతో మానసిక పరివర్తన ద్వారా కూడా కట్టడి చేసే ప్రయత్నం ముందునుంచీ జమిలిగా సాగింది. ప్రభుత్వాలు చట్టాలు, శిక్షలతో చేయబోయిందే -- వేదాలూ, కావ్యేతిహాసాలు సహా ప్రపంచ వాఙ్మయమంతా హితబోధతో చేయబోయింది. అందుకే ప్రత్యేకించి కావ్యాలను కాంతాసమ్మితాలన్నారు. 'భగవంతుడు ఆకలిచావును విధించలేదు, తిండి ఉన్నవాడు కూడా చావక తప్పదు; తనకున్నదాన్ని ఇతరులతో పంచుకునేవాడు ఎప్పటికీ అణ గారడు; దాతృత్వం లేనివాడు ఒంటరి అయిపోతా'డంటుంది ఋగ్వేదం. దయ, ధర్మం లేని కొంప కొంపే కాదంటుంది. విజ్ఞతా, వినయాలే తప్ప అహంకారం, ధిక్కారం పని చేయవని మహాభారతంలోని యక్షప్రశ్నల ఘట్టం చెబుతుంది. ఒక యక్షుడికి చెందిన చెరువులో నీళ్ళు తాగబోయి, అతని ప్రశ్నలకు జవాబు చెప్పడానికి నిరాకరించి, ధిక్కరించి తన నలుగురు సోదరులూ స్పృహ కోల్పోయినప్పుడు ధర్మరాజు వినమ్రంగా జవాబు చెప్పి సోదరులను బతికించుకుంటాడు. కనుక చట్టాలకూ, హితబోధకూ మధ్య సమతూకం తప్పనిసరి. ఏది ఎక్కువైనా సత్ప్రవర్తన గల్లంతవుతుంది. చట్టాలే సర్వస్వ మనుకుంటే వాటి ఉల్లంఘనా సర్వసామాన్యమవుతుంది. ఉమ్మడి పౌరస్మృతులతో పాటు హితమార్గంలో ఉమ్మడి పౌర ప్రవర్తనను తీర్చిదిద్దడమూ అంతే అవసరం.

# కార్పొరేట్లకు రైటాఫ్




స్విస్ బ్యాంకుల నుంచి నల్లధనాన్ని తీసుకువచ్చి దేశప్రజలకు తలా పదిహేను లక్షలు పంచుతామని చెప్పిన బీజేపీ సర్కార్ ఆ హామీని గాలికి వదిలేసి సుమారు 12 సంవత్సరాలైంది. బయటి దేశాల్లోని నల్లధనం తేవటం అటుంచి, గత పన్నెండేండ్లుగా ఇక్కడి బ్యాంకుల్లోని తెల్లధనాన్ని అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్టు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నది. మోదీ సర్కార్ అధికారంలోకి వచ్చిన 2014 నుంచి ప్రస్తుత 2026 వరకు అచ్చంగా పది లక్షల కోట్ల కార్పొరేట్ల రుణాలను 'రైటాఫ్' చేసినట్టు స్వయంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా లోక్‌సభకు వెల్లడించింది. విద్య, వైద్య, వ్యవసాయం వంటి కీలక రంగాలపై పెట్టుబడులకు చేతులు రాని కేంద్రం సర్కార్ కార్పొరేట్ కంపెనీలకు మాత్రం రైటాఫ్ రూపంలో లక్షల కోట్లు చెల్లించుకుంటుండటం విడ్డూరం. చిన్న రుణగ్రహీతల నుంచి బకాయిలు ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు ఇలా బడాబాబులకు ప్రజాధనాన్ని దోచిపెట్టడం ఏమిటనేది ప్రశ్న. సన్నకారు రైతులు, స్వయం ఉపాధిదారులు, మధ్య తరగతి కుటుంబాలు బ్యాంకు రుణం కట్టలేకపోతే బ్యాంకు అధికారులు నోటీసులు పంపి, ఆస్తుల స్వాధీనం వంటి కఠిన చర్యలను తీసుకుంటారు. వీటివల్ల క్రెడిట్ స్కోర్ దెబ్బతినడం అనే సమస్య మెడ మీద కత్తిలా వేలాడుతూ ఉంటుంది. బ్యాంకు వేల కోట్ల రుణాలు తీసుకున్న కార్పొరేట్ కంపెనీలు ఎగవేసిన రుణాలను రైటాఫ్ పేరిట వదిలేసుకోవటం ఏమిటనేది సామాన్య ప్రజల ప్రశ్న. అయితే, రైటాఫ్ అంటే పూర్తిగా రుణమాఫీ అని కాదని, కేవలం బ్యాంకుల బ్యాలెన్స్ షీట్ల నుంచి సదరు రుణాలను తొలగిస్తారు. ఇదొక సాంకేతిక ప్రక్రియ మాత్రమేనని అధికారవర్గాలు ఈ చర్యను సమర్థించుకుంటున్నాయి. రైటాఫ్ చేసినప్పటికీ సదరు రుణాల వసూలు ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ప్రభుత్వం నమ్మబలుకుతున్నది. కానీ ఆచరణలో రైటాఫ్ చేసిన రుణాల్లో ఎంత శాతం వెనక్కి వచ్చాయో మాత్రం వెల్లడించరు. ఈ రైటాఫ్‌లు 2018-19లో గరిష్ఠంగా రూ.1,48,753 కోట్లుగా ఉంటే 2025-26 నాటికి కనిష్ఠంగా రూ.20,485 కోట్లుగా నమోదయ్యాయి. ఈ రైటాఫ్స్ వల్ల బ్యాంకులపై పడే భారాన్ని అంతిమంగా నియమబద్ధంగా పన్నులు చెల్లించే పౌరులపైనే రుద్దుతారు. ఇదే విషయాన్ని విమర్శకులు 'ప్రైవేట్ లాభాలుపబ్లిక్ నష్టాలు' అని అభివర్ణిస్తుంటారు. ఆర్థిక వ్యవస్థలో బ్యాంకులది కీలక పాత్ర. దేశంలో బ్యాంకింగ్ వ్యవస్థను బీజేపీ సర్కార్ ఎలా నిర్వహిస్తున్నదీ ఈ తతంగం తెలియజేస్తున్నది. ఈ రుణాల మంజూరు సమయంలో పాటించిన ప్రమాణాలు, బ్యాంకుల బాధ్యత, ప్రభుత్వ పర్యవేక్షణ.. ఇవన్నీ ఇప్పుడు ప్రశ్నార్థకమవుతున్నాయి. ఎలాంటి పూచీకత్తులు, ఏయే అంచనాలతో ఈ భారీ రుణాలు ఇచ్చారు? వాటిపై కఠినమైన పర్యవేక్షణ ఎందుకు విఫలమైంది? డిఫాల్ట్‌లకు బాధ్యులెవరు? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు లేకపోవడం ప్రభుత్వ చర్య మీద అనుమానాలను పెంచుతున్నది. ప్రభుత్వం తరచూ 'బ్యాంకింగ్ రంగాన్ని బలోపేతం చేశాం', 'ఎన్‌పీఏలు తగ్గించాం' అని చెప్పుకొంటున్నది. కానీ ఈ తగ్గుదలలో భాగంగా ఇంతింత పెద్ద మొత్తంలో రుణాలను రైటాఫ్ చేస్తే, అది నిజమైన పరిష్కారమా లేదా గణాంకాల మాయాజాలమా? అని ఆలోచించాల్సిన విషయం. బ్యాలెన్స్ షీట్లలో సంఖ్యలు మెరుగుపడవచ్చు. కానీ మూల సమస్య అయిన రుణాల వసూలు తక్కుతూ తారుతూ సాగుతుంటే దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం తప్పదు.

## ఉద్యమ నాయకుడు నలపరాజు రమేష్‌కు ఘన సన్మానం

- ఉద్యమ సమరయోధుడిని సత్కరించిన బీఆర్ఎస్ ప్రతినిధులు
- విద్యార్థులను చైతన్యపరిచిన సేవలకు దక్కిన గౌరవం

**తొలివెలుగు, యాదాద్రి భువనగిరి :** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి, విద్యార్థి లోకాన్ని సమరానికి సన్నాహకం చేసిన బీఆర్ఎస్‌వీ మునుగోడు నియోజకవర్గ అధ్యక్షుడు నలపరాజు రమేష్‌కు ఘన సన్మానం లభించింది. యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆయనను నాయకులు సముచిత రీతిలో సత్కరించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో నిజాం కళాశాలలో విద్య అభ్యసించిన రమేష్.. ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షకు ఆకర్షితులై పోరాటంలో ప్రత్యక్షంగా భాగస్వాములయ్యారు. నిజాం కళాశాల, ఉస్మానియా విశ్వవిద్యాలయంతో పాటు మునుగోడు నియోజకవర్గంలో విద్యార్థుల్లో ఉద్యమ చైతన్యాన్ని నింపారు. పోరాట కాలంలో లాఠీ దెబ్బలు తింటూ, పోలీసు కేసులను సైతం లెక్కచేయకుండా ఉద్యమాన్ని ముందుండి నడిపించారు. రాష్ట్ర సాధన కోసం అహర్నిశలు శ్రమించిన ఉద్యమ నేతకు దశాబ్ది వేడుకల వేళ సన్మానం దక్కడం పట్ల బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.








# దీపం, ఉప్పు, పాలు చేతిలో నుంచి జారి కింద పడితే అశుభమా?

మన దైనందిన జీవితంలో కొన్నిసార్లు తెలియకుండానే చేతిలో ఉన్న వస్తువులు కింద పడిపోతుంటాయి. సాధారణంగా దీన్ని మనం పొరపాటు అనో లేదా ఏదో ఆలోచనలో ఉండి జరిగిందనో తేలికగా తీసుకుంటాం. కానీ వాస్తు, జ్యోతిష్య శాస్త్రాల ప్రకారం చేతి నుంచి కొన్ని నిర్దిష్టమైన వస్తువులు పదే పదే కింద పడటం కేవలం యాదృచ్ఛికం మాత్రమే కాదు. అది భవిష్యత్తులో రాబోయే సమస్యలకు, ఆర్థిక ఇబ్బందులకు లేదా అశుభ పరిణామాలకు ఒక సంకేతం కావచ్చని వాస్తు నిపుణులు చెబుతున్నారు. వాస్తు శాస్త్రం ప్రకారం.. పూజ లేదా హారతి ఇచ్చే సమయంలో చేతిలో ఉన్న వెలుగుతున్న దీపం అకస్మాత్తుగా కింద పడిపోతే దాన్ని చాలా అశుభంగా భావిస్తారు. దేవునికి చేసే పూజలో ఏదో లోపం ఉందనడానికి లేదా భవిష్యత్తులో ఇంట్లోకి ఏదైనా పెద్ద విపత్తు, తీవ్రమైన ఆర్థిక సంక్షోభం రాబోతోందనడానికి ఇది సూచన అని వాస్తు శాస్త్రం చెబుతోంది. మన వంటగదిలో వాడే ఉప్పు కేవలం వంటకాల రుచిని మాత్రమే పెంచదు, దానికి జ్యోతిష్యపరంగా శుక్ర, చంద్ర గ్రహాలతో తీవ్రమైన సంబంధం ఉంది. అనుకోకుండా చేతిలో నుంచి ఉప్పు తరచూ కింద పడుతుంటే అది ఇంట్లో దరిద్రానికి, ఆర్థిక ఇబ్బందులకు దారితీస్తుంది. అంతేకాదు, ఉప్పు కింద పడటం వల్ల కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు జరిగే అవకాశం కూడా ఉంటుంది. ఇక పాలు పొంగి కింద పడటం లేదా పాత్ర నుంచి ఒలికిపోవడం ఇంట్లో చాలా సాధారణంగా జరుగుతుంటుంది. కానీ జ్యోతిష్య కోణంలో చూస్తే ఇది అస్సలు మంచిది కాదు. పాలు కింద పడిపోతే ఇంట్లో మానసిక ప్రశాంతత లోపించడంతో పాటు ప్రతికూల శక్తి పెరుగుతుందని, ధన నష్టం జరుగుతుందని నమ్ముతారు. జాతకంలో చంద్రుని ప్రభావం బలహీనంగా ఉన్నప్పుడు ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతుంటాయి. వంటకు వాడే నూనె లేదా నూనె సీసా చేతి నుంచి జారి కింద పడిపోవడం లేదా పగిలిపోవడం పెద్ద అపశకునంగా పరిగణిస్తారు. నూనె నేలపాలు కావడం అనేది రాబోయే రోజుల్లో వ్యాపారంలో, ఉద్యోగంలో లేదా ఆర్థిక విషయాల్లో పెద్ద ఎత్తున నష్టాలు, ఆటంకాలు ఎదురుకాబోతున్నాయనడానికి ఒక హెచ్చరిక. అలాగే దేవుడి పూజ గదిలో పూజ తాంబూలం లేదా అందులోని అక్షతలు, కుంకుమ, పువ్వులు వంటి పదార్థాలు చేతి నుంచి జారి కింద పడి చెల్లాచెదురైతే అది చాలా జాగ్రత్తగా ఉండాల్సిన సమయం. ఇంట్లోని కుటుంబ సభ్యులెవరైనా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందనడానికి లేదా ఏదైనా అపశకునం జరగబోతుందనడానికి ఇది సంకేతం. ఇంట్లో ప్రతికూల శక్తి పెరిగినప్పుడు కూడా ఇలాంటి సంఘటనలు జరుగుతుంటాయని వాస్తు నిపుణులు చెబుతున్నారు.

# మస్క్ చేతిలో డేంజర్ వెపన్!



స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలు ఇండియాలోకి రాకుండా మన దేశానికి చెందిన సంపన్న వ్యాపారులు అడ్డుకుంటున్నారన్నది మస్క్ వాదన. ఇందులో నిజం ఎంతో పక్కన పెడితే... ఈ వ్యాఖ్యలకు కేంద్ర ప్రభుత్వం గట్టిగానే కౌంటర్ ఇచ్చింది. మస్క్ కామెంట్స్ సంగతేమో గానీ... ఆయన ఓనర్ గా ఉన్న స్టార్ లింక్ ఇంటర్నెట్ సేవలతో చాలా పెద్ద సమస్యే ఉంది. అది కేవలం మామూలు ఇంటర్నెట్ కనెక్షన్ల వ్యవహారం మాత్రమే కాదు... దేశ భద్రతకు సంబంధించిన అంశం కూడా ఉంది. అందుకే కేంద్రం స్టార్ లింక్ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోందా? స్టార్ లింక్ అనేది నేరుగా శాటిలైట్ తో కనెక్ట్ అయిన ఇంటర్నెట్ వ్యవహారం. జియో, ఎయిర్ టెల్, ఐడియా లాగా కాదు... స్టార్ లింక్ ద్వారా నేరుగా శాటిలైట్ నుంచే దేశంలో ఏ మూలకైనా కనెక్టవిటీ అందించవచ్చు.. టవర్స్ లేవు... సిగ్నల్స్ రావడం లేదన్న చర్చే ఉండదు. అందుకే స్టార్ లింక్ అన్నది ప్రపంచవ్యాప్తంగా అంత ఫేమస్ అయ్యింది. మన పొరుగు దేశాల్లో కూడా స్టార్ లింక్ సేవలు ఉన్నా... ఇండియా మాత్రం ఇంకా అప్లికేషన్ దశలోనే ఉంది. అయితే తమ సేవలు భారత్ లో ఇంకా రాకపోవడానికి మాత్రం టెలికాం మార్కెట్‌ను గుత్తాధిపత్యంలో ఉంచుకునే కొందరు వ్యక్తులే అంటూ ఎలన్ మస్క్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలను వెంటనే ఖండించింది. శాటిలైట్ కమ్యూనికేషన్ల కోసం తమ విధానాలు అత్యంత పారదర్శకంగా ఉన్నాయని స్పష్టం చేసింది. ప్రస్తుతం మూడు శాటిలైట్ ఇంటర్నెట్ కంపెనీలకు లైసెన్సులు ఇచ్చామని తెలిపింది. స్పెక్ట్రమ్ కేటాయింపులకు ముందు వీటికి సంబంధించిన భద్రతాపరమైన అంచనాలు కొనసాగుతున్నాయని టెలికాం మంత్రిత్వ శాఖ వెల్లడించింది. తమ విధానాలు వివక్షతో ఉన్నాయన్న మస్క్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని తేల్చి చెప్పింది. అయితే ఈ రెగ్యులేటరీ వివాదం వెనుక మరో పెద్ద సమస్యే దాగి ఉంది. అంతరిక్షం ఆధారంగా పనిచేసే కమ్యూనికేషన్ నెట్‌వర్క్ కావడంతో దీని ఆపరేటింగ్ సంస్థ స్పేస్ ఎక్స్ చేతిలో అపారమైన నియంత్రణ అధికారాలు ఉంటాయి. ఎవరికి ఇంటర్నెట్ యాక్సెస్ ఇవ్వాలి... ఎక్కడ నెట్‌వర్క్ ఆపరేట్ చేయాలి... టెర్మినల్స్ ఎప్పుడు కనెక్ట్ కావాలి అనేదంతా ఆ కంపెనీయే నిర్ణయిస్తుంది. ఈ స్టార్ లింక్ సమస్యకు ఉక్రెయిన్ సంక్షోభం అతిపెద్ద ఉదాహరణగా చెప్పుకోవచ్చు. రష్యా దాడులతో సాధారణ సమాచార వ్యవస్థలు ధ్వంసమైనప్పుడు ఉక్రెయిన్‌కు స్టార్ లింక్ సేవలు చాలా కీలకంగా మారాయి. అయితే 2022 సెప్టెంబర్‌లో ఉక్రెయిన్ ప్రతిదాడి చేస్తున్న సమయంలో ఖేర్సన్ ప్రాంతంతో పాటు పలుచోట్ల స్టార్ లింక్ సేవలను మస్క్ నిలిపివేశారు. దీనివల్ల మిలటరీ కమ్యూనికేషన్లతో పాటు డ్రోన్ ఆపరేషన్లకు తీవ్ర అంతరాయం కలిగింది. రష్యా బలగాలపై దాడుల్లో స్పేస్ ఎక్స్ ప్రత్యక్షంగా పాల్గొనడం ఇష్టం లేకే సేవలను యాక్టివేట్ చేయలేదని మస్క్ స్వయంగా చెప్పారు. ఒక దేశ ఇంటర్నెట్ మొత్తాన్ని కట్ చేసే మ్యాజిక్ బటన్ లేకపోయినా.. భౌగోళికంగా యాక్సెస్‌ను కట్టడి చేసే సత్తా, టెర్మినల్స్ డిసేబుల్ చేసే సామర్థ్యం స్పేస్ ఎక్స్‌కు ఉంది. దీన్నే టెలికాం భాషలో కిల్ స్విట్ అని చెబుతారు.కేవలం ఉక్రెయిన్ విషయంలోనే కాదు.. ఇతర దేశాల్లోనూ స్పేస్ ఎక్స్ తన నెట్‌వర్క్ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. సూడాన్ అంతర్యుద్ధంతో స్థానిక టెలికాం వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు స్టార్ లింక్ సేవలు ఎంతో ఉపయోగపడ్డాయి. కానీ అక్కడ స్టార్ లింక్ రోమింగ్‌ను పరిమితం చేయడంతో లక్షలాది మందికి కనెక్షన్లు పోతాయని మానవతా సంస్థలు ఆందోళన వ్యక్తం చేశాయి.

# గ్రీన్‌కార్డు ఆంక్షలు.. అయినా లాభాల్లో టీసీఎస్, ఇన్ఫీ, విప్రో షేర్లు: ఎందుకు?

అమెరికా గ్రీన్‌కార్డ్ ప్రోగ్రామ్‌పై ఆంక్షలు విధించినా భారత ఐటీ కంపెనీల షేర్లు మాత్రం లాభాల్లో పయనిస్తున్నాయి. నేటి ట్రేడింగ్ ప్రారంభంలో టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో సహా పలు ఐటీ కంపెనీల షేర్లు భారీగా పెరిగాయి. గత సెషన్‌లో మార్కెట్లు తీవ్రంగా పడిపోవడంతో తక్కువ ధరలకు షేర్లు కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపడం, టీసీఎస్ ఆర్థిక ఫలితాలు, ఏఐ వ్యాపారంలో వృద్ధి ఇందుకు ప్రధాన కారణాలుగా నిలిచాయి. ఉదయం ట్రేడింగ్‌లో నిఫ్టీ ఐటీ సూచీ 3.31 శాతం పెరిగి 28,654.70 పాయింట్లకు చేరింది. టీసీఎస్ షేరు 4.62 శాతం, ఇన్ఫోసిస్ 3.12 శాతం, విప్రో 3.31 శాతం, టెక్ మహీంద్రా 2.19 శాతం చొప్పున పెరిగాయి. ఎల్‌టీఎం, పర్సిస్టెంట్ సిస్టమ్స్, ఎంఫాసిస్ షేర్లలోనూ కొనుగోళ్లు కనిపించాయి. అమెరికా ప్రభుత్వం టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, హెచ్‌సీఎల్‌టెక్ సహా పలు సంస్థలను 'పర్మనెంట్ లేబర్ సర్టిఫికేషన్' (పెర్మ్) కార్యక్రమం నుంచి తాత్కాలికంగా నిలిపివేసింది. ఉద్యోగ ఆధారిత గ్రీన్‌కార్డ్ ప్రక్రియలో ఈ కార్యక్రమం కీలకమైనది. దీంతో అమెరికాలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న భారత ఐటీ సంస్థలపై ప్రభావం ఉంటుందనే ఆందోళనలు మొదలయ్యాయి. ఈ ఆంక్షల వల్ల తమ అమెరికా ఉద్యోగుల నియామక వ్యూహం, కస్టమర్లకు అందించే సేవలపై ప్రభావం ఉండబోదని టీసీఎస్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. గత రెండేళ్లలో తమ పెర్మ్ దరఖాస్తులు సింగిల్ డిజిట్‌లోనే ఉన్నాయని వెల్లడించింది. వచ్చే ఐదేళ్లలో అమెరికాలో మరో 15 వేల మందిని నియమించుకోవాలన్న ప్రణాళిక కూడా కొనసాగుతుందని పేర్కొంది. ఈ వివరణలు ఇన్వెస్టర్ల ఆందోళనలను కొంత తగ్గించాయి. అయితే, పెర్మ్ ఆంక్షలు అంటే హెచ్-1బీ వీసాలన్నింటినీ నిలిపివేయడం కాదనే విషయాన్ని నిపుణులు ప్రస్తావిస్తున్నారు. మరోవైపు గురువారం మార్కెట్లు భారీగా పడిపోవడంతో తక్కువ ధరలకు లభిస్తున్న



షేర్లను కొనుగోలు చేసేందుకు ఇన్వెస్టర్లు ముందుకొస్తున్నట్లు నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీన్ని మార్కెట్ పరిభాషలో 'బార్గెయిన్ బయ్యింగ్' అంటారు. టీసీఎస్ రెండో త్రైమాసిక ఫలితాలు కూడా ఐటీ రంగానికి ఊరటనిచ్చాయి. కంపెనీ నికర లాభం ఏడాది క్రితంతో పోలిస్తే 15 శాతం పెరిగి రూ.13,884 కోట్లకు చేరింది. ఆదాయం 11.2 శాతం వృద్ధితో రూ.73,188 కోట్లుగా నమోదైంది. ముఖ్యంగా ఏఐ వ్యాపారం నుంచి వచ్చే వార్షిక ఆదాయం దాదాపు 20 శాతం పెరిగి 3.1 బిలియన్ డాలర్లకు చేరింది. అయితే, త్రైమాసిక ప్రాతిపదికన స్థిర కరెన్సీ లెక్కల్లో ఆదాయ వృద్ధి కేవలం 0.5 శాతమే ఉండటం గమనార్హం. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల అమ్మకాలు, అధిక ముడిచమురు ధరలు, అమెరికా బాండ్లపై అధిక రాబడులు మార్కెట్‌కు ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. అందువల్ల ఐటీ షేర్లలో ఈ పెరుగుదల ఎంతకాలం కొనసాగుతుందనేది అంతర్జాతీయ పరిణామాలు, రానున్న త్రైమాసికాల్లో కంపెనీల ఆదాయ వృద్ధిపై ఆధారపడి ఉంటుంది.




# గాచ్చిన ముడిచమురు ధర.. ట్రంప్ వ్యాఖ్యలే కారణం

ఇరాన్‌పై ఇప్పట్లో దాడి చేసే ఉద్దేశం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. ఈ ప్రకటనతో చమురు సరఫరాపై నెలకొన్న ఆందోళనలు తాత్కాలికంగా తగ్గడంతో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్‌కు 72 సెంట్లు తగ్గి 103.53 డాలర్లకు చేరింది. అలాగే, వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) క్రూడ్ ధర 52 సెంట్లు తగ్గి 90.97 డాలర్ల వద్ద స్థిరపడింది. నవంబర్ 3న జరగనున్న మధ్యంతర ఎన్నికలకు ముందు ఇరాన్‌పై ఎటువంటి సైనిక దాడి ఉండబోదని ట్రంప్ గురువారం తన సోషల్ మీడియా ఖాతాలో వెల్లడించారు. ఇరాన్‌తో ఫలప్రదమైన చర్చలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఎన్నికల ముందే ఇరాన్‌పై అమెరికా సైనిక చర్యకు దిగొచ్చని అంతకుముందు వచ్చిన వార్తలతో చమురు ధరలు పెరిగాయి. అయితే, ట్రంప్ తాజా ప్రకటనతో సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న భయాలు కొంతమేర తగ్గాయి. అయినప్పటికీ, ఈ వారంలో బ్రెంట్ క్రూడ్ ధర ఇప్పటికే 4 శాతం పెరిగి లాభాల బాటలో పయనిస్తోంది. మధ్యప్రాచ్యంలో చమురు రవాణా నౌకలపై దాడులు, కీలకమైన హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ప్రతిష్టంభన వంటి అంశాలు ధరలు తగ్గకుండా నిలుపుతున్నాయి. హర్మూజ్ జలసంధిని తెరిచే ప్రతిపాదనపై అమెరికా స్పందనను సమీక్షిస్తున్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చి తెలిపారు. మరోవైపు, ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇరాన్ చమురు ఎగుమతులపై అమెరికా కొత్తగా ఆంక్షలు విధించింది. ఇదే సమయంలో, గల్ఫ్ ఆఫ్ మెక్సికోలో ఇసాయాస్ హరికేన్ కారణంగా అమెరికాలో రోజుకు 1.3 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి నిలిచిపోయింది. ఈ పరిణామాలన్నీ చమురు మార్కెట్లో అస్థిరతను కొనసాగిస్తున్నాయి.

# రాజభవనంలో నర్తకీమణి



'ఎస్ఆర్ కళ్యాణమండపం' ఫేం శ్రీధర్ గాదె దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతున్నది. వెంకట్ తలారి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఈశ్వర్ రాచిరాజు, నందు, నిఖిత ప్రధానపాత్రధారులు. పూజిత పొన్నాడ, సింధు కాసారం ఇతర పాత్రధారులు. ఈసినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఇందులో నర్తకి పాత్రను పూజిత పొన్నాడ పోషిస్తున్నది. సోమవారం ఆమె పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ఈ సినిమాలోని ఆమె పాత్రకు చెందిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. రాజభవనంలో నర్తకీమణిగా మస్తాబైన పూజిత పొన్నాడను ఈ పోస్టర్‌లో చూడొచ్చు. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే హారర్ సినిమా ఇదని, సరికొత్త కథ, కథనాలతో సినిమా ఆకట్టుకుంటుందని, ఈ సినిమాకు సంబంధించిన టైటిల్, ఇతర వివరాలు త్వరలో తెలియజేస్తామని మేకర్స్ చెప్పారు.



# 'బ్లడీ రోమియో'లో నాయికగా?

'ది ప్యారడైజ్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్‌ని దక్కించుకున్న హీరో నాని తదుపరి సినిమా 'బ్లడీ రోమియో' కోసం సిద్ధమవుతున్నారు. సుజీత్ దర్శకత్వంలో స్టైలిష్ గ్యాంగ్‌స్టర్, రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కనుంది. త్వరలో ఈ సినిమా పట్టాలెక్కనుంది. ప్రస్తుతం కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం పలువురు అగ్ర హీరోయిన్ల పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. మీనాక్షి చౌదరి పేరు ప్రముఖంగా వినిపించింది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో ప్రీతి ముకుందన్ కథానాయికగా ఖరారైందని తెలిసింది. దర్శకుడు సుజీత్ డిజైన్ చేసిన పాత్రకు ఆమె పర్‌ఫెక్ట్ ఛాయిస్ అవుతుందని భావించిన మేకర్స్ ఆమె వైపే మొగ్గు చూపిస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయంలో మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'కన్నప్ప' చిత్రంతో తెలుగులో మంచి గుర్తింపు తెచ్చుకుంది ప్రీతి ముకుందన్. ఈ మధ్యకాలంలో బ్లాస్ట్, ఇదయం మురళీ వంటి తమిళ చిత్రాలతో విజయాలను తన ఖాతాలో వేసుకున్నది. ఒకవేళ 'బ్లడీ రోమియో'లో ఆమె కథానాయికగా ఖరారైతే తెలుగులో ఈ భామ కెరీర్‌కు మరింత ఊపునిస్తుందని అభిమానులు భావిస్తున్నారు.

# సంఘర్షణతో జైలర్ ప్రపంచం



ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ 'జైలర్ 2' సినిమా ట్రైలర్ వచ్చేసింది. తెలుగులోనూ విడుదలైన ఈ ట్రైలర్ హై వోల్టేజ్ యాక్షన్‌తో రజనీ మార్క్ స్టైల్, కామెడీ, యాటిడ్యూడ్‌తో ప్రేక్షకుల్లో అంచనాలు పెంచింది. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తనదైన శైలిలో 'జైలర్' ప్రపంచాన్ని మరింత భారీగా, మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దినట్టు ట్రైలర్ చెబుతున్నది. జైలర్ ముత్తవేల్ పాండియన్‌గా తలైవా మరోసారి తనదైన స్టైల్, మాస్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. ఈ సీక్వెల్ మరింత సంఘర్షణలతో, భారీ సవాళ్లతో విస్తృతమైన ప్రపంచాన్ని ఆవిష్కరించనున్నదని మేకర్స్ చెబుతున్నారు. మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్ ప్రత్యేక పాత్రలు పోషించిన ఈ చిత్రంలో రమ్యకృష్ణ, విద్యాబాలన్ కథానాయికలు. ఎస్.జె.సూర్య, యోగిబాబు, సూరజ్ వెంజారమూడు ఇతర పాత్రధారులు. సన్ పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ తెలుగులో విడుదల చేయనున్నది. ఈ నెల 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి కెమెరా: కార్తీక్ కన్నన్, సంగీతం: అనిరుధ్ రవిచంద్రన్.





# మొత్తం చిత్ర పరిశ్రమను నిందించకూడదు : అమలా పాల్

సినిమాల్లో కొందరు హీరోయిన్లను అభ్యంతరకరంగా చూపించడానికి మొత్తం చిత్ర పరిశ్రమను నిందించడం సరికాదని, అది ఆయా చిత్రాల దర్శకుడు లేదా టీమ్ ఆలోచనా విధానంపై ఆధారపడి ఉంటుందని ప్రముఖ నటి అమలా పాల్ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయని, మహిళా ప్రాధాన్య చిత్రాలు ఎక్కువగా వస్తుండటం శుభపరిణామమని ఆమె పేర్కొన్నారు. కొచ్చిలో జరిగిన 'ఇండియా టుడే సౌత్ కాన్‌క్లేవ్ 2026'లో అమలా పాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దక్షిణాది సినిమాల్లో హీరోయిన్ల పాత్రల చిత్రీకరణపై వస్తున్న విమర్శలపై స్పందించారు. "ప్రతి పరిశ్రమ నుంచి మంచి మహిళా ప్రాధాన్య చిత్రాలు వస్తున్నాయి. కాబట్టి మొత్తం పరిశ్రమను నిందించదలుచుకోలేదు. సమస్య ఏదైనా ఉంటే అది ఒక సినిమాకు లేదా దర్శకుడి ఆలోచనా విధానానికే పరిమితమై ఉంటుంది," అని ఆమె వివరించారు. 15 ఏళ్లుగా ఇండస్ట్రీలో ఉన్న తాను ఎప్పుడూ మూస పాత్రలకు భిన్నంగా, ప్రత్యేకమైన పాత్రలనే ఎంచుకున్నానని అమలా పాల్ తెలిపారు. ఇందులో భాగంగానే 2019లో 'ఆడై' (తెలుగులో 'ఆమె') లాంటి సాహసోపేతమైన చిత్రంలో నటించానని గుర్తుచేసుకున్నారు. "ఆ సమయంలో నా ఇమేజ్ ఏమవుతుందోనని, అలాంటి పాత్రలే మళ్లీ వస్తాయేమోనని భయపడ్డాను. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే అది చాలా ధైర్యమైన నిర్ణయంగా అనిపిస్తోంది. కానీ, ఇప్పుడు నన్ను 'ఆడై' లాంటి సినిమా చేయమంటే బహుశా చేయలేకపోవచ్చు," అని ఆమె స్పష్టం చేశారు. మహిళలు తమ స్థానం కోసం కష్టపడుతున్నారని, రానున్న రోజుల్లో మరింత సానుకూల వాతావరణం ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com